Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 04.04.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 44 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com




## అక్కడ కళకళ... ఇక్కడ వెలవెల

రెండు కళ్లు పోగొట్టుకోవడం కంటే ఒక కన్నును కోల్పోయినా రెండో కన్నును కాపాడుకోవాలన్న కాంగ్రెస్ అధిష్టానం సూత్రం సత్ఫలితాలనిచ్చే దిశగా సాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా పతనమయ్యే పరిస్థితిని కాంగ్రెస్ తప్పించుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ద్వారా సీమాంధ్రలో ఆత్మహత్య చేసుకున్నా, తెలంగాణలో మాత్రం చావు నుండి బయటపడి ఈరోజు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితికి చేరింది.

తెలంగాణ ప్రకటన వెలువడక ముందువరకు కూడా కాంగ్రెస్‌పై సీమాంధ్ర ప్రజలలో ఎంత అసంతృప్తి ఉండిందో తెలంగాణలోనూ అంతే అసంతృప్తి ఉండింది. రాష్ట్ర విభజన అనే అంశమే లేకుంటే కాంగ్రెస్ అటు తెలంగాణలోనూ ఇటు సీమాంధ్రలోనూ పతనమై

(మిగతా 10వ పేజీలో)



- ఇద్దరికీ ఫైనల్ మ్యాచే
- విజేతలే ఫీల్డ్‌లో వుంటారు
- పరాజితులు తెరవెనక్కిపోతారు
- ఎవరు అధికారంలోకి వచ్చినా ఇక వదలరు



ఓట్ల వేట...

# ఫైనల్ ఆట!

***భారత్-పాకిస్థాన్‌లు ట్వంటీ-20 మ్యాచ్ ఆడుతుంటే ఎంత మజాగా ఉంటుందో, ఇంగ్లాండ్-హాలెండ్‌ల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుంటే ఎంత రసవత్తరంగా ఉంటుందో రేపు సీమాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల మధ్య జరగబోయే సార్వత్రిక ఎన్నికల యుద్ధం కూడా అలాగే ఉండబోతుంది.***

తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ఈ ఎన్నికలు ఒక రకంగా ఫైనల్ మ్యాచ్! ఈ మ్యాచ్‌లో ఓడిపోతే మాత్రం ఇక ఆయన రిటైర్డ్ కాక తప్పదు. ఇప్పటికే రెండుసార్లు అధికారానికి దూరమయ్యాడు. 2004లో అధికారాన్ని పోగొట్టుకున్నాడు. 2009లో అధికారాన్ని తిరిగి చేజిక్కించుకోలేకపోయాడు. పదేళ్లు అధికారంలో లేకపోయినా పార్టీని ఇంతవరకు లాక్కొచ్చాడంటే అది ఆయన నాయకత్వ గొప్పతనమే. చిరంజీవి లాంటి వాళ్లు పదినెలలు కూడా పార్టీని నడపలేక మూతేసుకుంటే చంద్రబాబు సొంతంగా ఏ ఇమేజ్ లేకుండా పదేళ్లు పార్టీని నడపడం చిన్నవిషయం కాదు. అయితే అధికారం లేకుండా ఇంకో ఐదేళ్లు వేచిచూసే ఓపిక ఆ పార్టీ లీడర్లలోనూ, కేడర్‌లోనూ లేదు. ఈసారి తెలుగుదేశం అధికారంలోకి రాకుంటే ఇక పతనం ఖాయం. ఎందుకంటే జగన్ అధికారంలోకి వచ్చాడంటే గుజరాత్‌లో మోడీలా, ఒరిస్సాలో నవీన్‌లా, బీహార్‌లో నితీష్‌లా పాతుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. ప్రజల నాడి తెలిసిన నాయకుడు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నడుచుకుని ఈ రాష్ట్రంలో శాశ్వతంగా తన ముద్ర వేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. జగన్ సీఎం అయితే మాత్రం చంద్రబాబుకు శంకరగిరిమాన్యాలే!

అదే సమయంలో చంద్రబాబు సీఎం అయినా జగన్‌కు ఇదే పరిస్థితి. చంద్రబాబు సీఎంగా ఉండగా చేసిన తప్పులవల్ల పదేళ్లు అధికారానికి దూరమయ్యాడు. సీఎం అయితే మరోసారి ఆయన ఆ తప్పులు చేయకపోవచ్చు. శాశ్వతంగా అధికారాన్ని నిలబెట్టుకోవడంపైనే ఆయన దృష్టి సారించవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల సమరానికి తెరలేవనుంది. కరెక్ట్‌గా

(మిగతా 10వ పేజీలో)

- పార్టీల ఎత్తులు

## దిగజారిన పొత్తులు

**రాష్ట్రంలో రాజకీయపొత్తులు నాలుగు స్థంభాలాటగా మారాయి. ఒక పార్టీతో పొత్తు కోసం మరో పార్టీ ఆరాటపడుతుండడం చూస్తుంటే... ఔరా రాజకీయాలు ఏ స్థాయికి దిగజారిపోయాయనిపిస్తుంది. ఈ పొత్తుల రింగాటలో ఆసక్తికరమైన విషయం ఏంటంటే మతతత్వపార్టీ అంటూ ముద్రవేసి మిగిలిన పార్టీలు ఏ బీజేపీనైతే ఇంతకాలం దూరంగా పెడుతూ వచ్చాయో అదే బీజేపీతో పొత్తు కోసం పలు పార్టీలు వెంపర్లాడడం ఆశ్చర్యం కలిగిస్తుంది.**

సీమాంధ్రలోనూ, తెలంగాణలోనూ బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఏ స్థాయికి దిగజారి బేరం ఆడాడో చూసాం. ఇంతకుముందంతా జరిగిన పొత్తుల విషయంలో తెలుగుదేశం డిమాండ్ చేసే స్థితిలో ఉంటే బీజేపీ కొంచెం తగ్గి ఉండేది. కాని ఇప్పుడు మాత్రం బీజేపీ డిమాండ్ చేసే స్థాయిలో వుంటే దానికి టీడీపీ తలొంచాల్సి వస్తుంది. దీనికంతటికీ కారణం నరేంద్ర మోడీకి ప్రజల్లో ఆదరణ ఉందనుకోవడమే! ముస్లింలు, క్రైస్తవులు ఎక్కువశాతం మంది జగన్ వైపు ఉన్నారు. బీజేపీతో పొత్తు లేకపోయినా వీళ్లొచ్చి తెలుగుదేశం పక్కన చేరేదేమీ లేదు. కాబట్టి బీజేపీతో పొత్తు పెట్టుకుంటే మోడీ ఇమేజ్‌ను ఓట్లుగా మలచుకోవచ్చునేది చంద్రబాబు ప్రయత్నం. ఏ లెక్కన చూసినా సీమాంధ్రలో టీడీపీ కంటే

(మిగతా 10వ పేజీలో)



శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
శ్రీరామనవమి శుభాకాంక్షలు.
- సం/-

## మ్యాజిక్ నెంబర్ గేములో...



# నెగ్గేదెవరు?



***నెల్లూరు నగరపాలకసంస్థ తదుపరి మేయర్ ఎవరు? డాక్టర్ జెడ్. శివప్రసాదా? లేక షేక్ అబ్దుల్ అజీజా? ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమైతే ఇప్పటికే మేయర్ ఎవరనేది తేలిపోయి ఉండాలి. కాని హైకోర్టు 2వ తేదీ జరగాల్సిన కౌంటింగ్‌ను 9వ తేదీకి వాయిదా వేసింది. దీనిమీద సుప్రీంకోర్టు మళ్ళీ స్టే ఇవ్వకుంటే 9వ తేదీ కౌంటింగ్ ఉంటుంది.***

మార్చి 30న నగరపాలకసంస్థలో 54డివిజన్‌లకు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఎన్నికల తర్వాత ఎవరి లెక్కల్లో వాళ్లున్నారు. నెల్లూరంతా ఫ్యాన్‌గాలి బాగా తోలిందని, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి 30కిపైగా స్థానాలు ఖాయమని, మేయర్ పీఠం మాదేనని వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ వంటి ఎన్నికల్లో పార్టీల గాలులు తోలడం, ఫలితాలు ఏకపక్షంగా రావడం జరుగుతుంది. కాని స్థానిక ఎన్నికల్లో అటువంటి పరిస్థితి తక్కువగా వుంటుంది. డివిజన్ స్థాయిలో పోటీ చేస్తున్న అభ్యర్థుల బలాబలాలను బట్టే ఎక్కువశాతం ఫలితాలు వస్తుంటాయి. అయితే ఈ ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపించిన విషయం

(మిగతా 10వ పేజీలో)




- కంచిపట్టు • బెనారస్ • డిజైనర్ శారీస్
- గాగ్రాస్ • సల్వార్స్ • డ్రెస్ మెటీరియల్స్
- వెస్ట్రన్‌వేర్ • మెన్స్‌వేర్

కళానికేతన్®
షాపింగ్ మాల్
ట్రంక్‌రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్: 2316677

### వైకాపా వైపు...

# కాంగ్రెస్ కేడర్





**ఆత్మకూరు నియోజకవర్గం నుండి మళ్లీ పోటీ చేస్తానని మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంగా చెప్పకపోతుండడంతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ కేడర్ అంతా కూడా వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ వైపు తరలిపోతున్నట్లు తెలుస్తుంది.**

కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదని నిర్ధారించుకున్న మండలస్థాయి నాయకులంతా కూడా వైసిపి వైపు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో ఇంతవరకు ఆనం వర్గంగా సాగిన ఇంకో సామాజిక వర్గం మాత్రం తెలుగుదేశంలో చేరడానికి సంసిద్ధమైంది.

రాష్ట్ర విభజన జరగకముందు వరకు కూడా నియోజకవర్గంలో ఆనం రామనారాయణరెడ్డి బలంగానే వుండినాడు. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ గెలుచుకోగల ఏకైక సీటు ఆత్మకూరే అన్న ప్రచారం వుండింది. కాంగ్రెస్‌ను చూసి కాకపోయినా ఇక్కడ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసైనా ఆనంకు ఓట్లేస్తారనే పరిస్థితి ఉండింది. రాష్ట్ర విభజన తర్వాత ఆ పరిస్థితి కూడా పోయింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తే ఆయన గెలిచే పరిస్థితి లేదు. అదే తెలుగుదేశం అభ్యర్థిగా అయితే గెలుపుకు అవకాశముంది. కాని ఆయన పార్టీ మారే పరిస్థితి లేదు.

తన కేడర్‌ను కాపాడుకునే విషయంపై కూడా ఆనం రామనారాయణరెడ్డి దృష్టి పెట్టలేదు. స్థానిక ఎన్నికలను ఆయన పూర్తిగా పట్టించుకోలేదు. అభ్యర్థుల ఎంపిక, ఆర్థిక వ్యవహారాలనంతా కూడా ఆయా మండలాల స్థానిక నాయకులనే చూసుకోమన్నారు. దీంతో మండలస్థాయి నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అలాగే వచ్చే ఎన్నికలలో పోటీ చేసే విషయంపై కూడా ఆనం రామనారాయణరెడ్డి తేల్చిచెప్పడం లేదు. నువ్వు పోటీ చేస్తానంటే ఓడినా గెలిచినా మీతోనే ఉంటాము, లేదంటే ప్రత్యామ్నాయం చూసుకుంటామని కాంగ్రెస్ నాయకులు అడిగారు. నేను పోటీ చేసేది మీకు అనవసరం, మీకు వేరే ఆలోచనలుంటే నేనేమీ చేయలేనని ఆనం చెప్పినట్లు తెలుస్తుంది. దీంతో ఆనం పోటీ చేయడం సందేహంగా వుండడంతో కాంగ్రెస్ నాయకులు ఎక్కువమంది వైకాపాలోకి, ఇంకోవర్గం నాయకులు టీడీపీలోకి పోవడానికి సిద్ధపడ్డారు. ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేయడం లేదనే సమాచారం అందడంతో వైకాపా అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డి మర్రిపాడు, అనంతసాగరం, ఆత్మకూరు, ఏ.ఎస్.పేట, సంగం మండలాల్లోని కాంగ్రెస్ కేడర్‌ను తన వైపుకు లాక్కునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు.

# జడ్పీలోనూ గట్టిపోటీ!




**జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూడా వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య గట్టిపోటీ నడుస్తున్నట్లు తెలుస్తుంది.**

ఈనెల6, 11తేదీలలో రెండు విడతలుగా జడ్పీ ఎన్నికలు ముగియనున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం మే 7 తర్వాతే ఫలితాలు వెల్లడికానున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఛైర్మెన్ అభ్యర్థిగా బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, తెలుగుదేశంపార్టీ ఛైర్మెన్ అభ్యర్థిగా వేనాటి రామచంద్రారెడ్డిలను ప్రకటించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులంతా కూడా తెలుగుదేశంతో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుని ఎక్కడికక్కడ తెలుగుదేశంకు మద్దతుగా పనిచేస్తున్నారు. ఏ జడ్పీటీసీలోనూ కాంగ్రెస్ జాడ కనిపించడం లేదు. ప్రధానపోటీ అంతా కూడా వైసిపి, టీడీపీల మధ్యే కనిపిస్తుంది. అయితే అన్ని చోట్లా వైయస్ సానుభూతి, జగన్ ఇమేజ్, ఫ్యాన్‌గాలి కనిపిస్తుంది. దీనిని తెలుగుదేశం అభ్యర్థులు ఎంతవరకు తట్టుకుని నిలబడగలరనేది ప్రశ్న.

కొంతకాలం క్రితంతో పోలిస్తే ఈరోజుకి జిల్లాలో తెలుగుదేశం కొంత పుంజుకున్నది వాస్తవం. నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీ ఉపఎన్నికల నాటి వాతావరణమే ఇప్పుడుంటే తెలుగుదేశం తరపున నాయకులు పోటీ చేయాల్సిన పని కూడా లేదు. కాంగ్రెస్ పూర్తిగా పతనం కావడంతో అది తెలుగుదేశంకు బాగానే ఉపయోగపడుతుంది.

ఉదయగిరి నియోజకవర్గంలో 8మండలాలుంటే టీడీపీ, వైసిపిల మధ్య గట్టిపోటీ కనిపిస్తుంది. ఫలానా మండలంలో వైసిపి గాని టీడీపీ గాని ఖచ్చితంగా గెలుస్తుందనే పరిస్థితి లేదు. నియోజకవర్గంలోని కొండాపురం, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు, కలిగిరి మండలాలలో తెలుగుదేశం ఇటీవల బలం పుంజుకుంది. ఉదయగిరి, సీతారాంపురం, జలదంకి మండలాలలో ఇరు పార్టీలు గట్టిగా తలపడుతున్నాయి.

కావలి నియోజకవర్గంలో కావలి రూరల్, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాలున్నాయి. మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మళ్ళీ వైకాపాలో చేరాడు. బోగోలు, దగదర్తి మండలాలలో కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశం మద్దతుదారుల అవతారమెత్తారు. కావలి రూరల్‌లో వైసిపికి అనుకూలంగా వుండొచ్చు. మిగతా 3మండలాలలో గట్టిపోటీ తప్పదు. కోవూరు నియోజకవర్గంలో కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట జడ్పీటీసీలున్నాయి. వైసిపికే ఎక్కువ మండలాలలో అవకాశాలున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గానికొస్తే ముత్తుకూరు, టి.పి.గూడూరు, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు మండలాలున్నాయి. ముత్తుకూరులో తెలుగుదేశంకు అనుకూల వాతావరణం ఉండొచ్చు. మిగతా మండలాలలో వైసిపికి బాగున్నట్లు తెలుస్తుంది. గూడూరు నియోజకవర్గంలోకి గూడూరురూరల్, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు మండలాలు వస్తాయి. ఎక్కువ మండలాలలో వైసిపికే అనుకూలంగా వున్నట్లు తెలుస్తుంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సూళ్లూరుపేట జడ్పీటీసీ నుండి టీడీపీ ఛైర్మెన్ అభ్యర్థి వేనాటి రామచంద్రారెడ్డే పోటీలో వున్నారు. తడ, డి.వి.సత్రం, నాయుడుపేట, పెళ్లకూరు మండలాలలో ఇరుపార్టీలకు సమానపోటీ వుంది. వెంకటగిరి నియోజకవర్గంలో వెంకటగిరి రూరల్, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలున్నాయి. ఎక్కువ మండలాలలో వైసిపికే అవకాశాలున్నట్లు సమాచారం. ఆత్మకూరు నియోజకవర్గంలో చూస్తే ఆత్మకూరు జడ్పీటీసీ నుండి వైకాపా మేయర్ అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తలపడుతున్నాడు. ఇక ఏ.యస్.పేట, మర్రిపాడు, అనంతసాగరం మండలాలలో వైసిపి బలంగా వుంది. చేజర్ల, సంగం మండలాలలో టీడీపీ గట్టిపోటీనిచ్చే అవకాశముంది. నెల్లూరురూరల్ జడ్పీటీసీ సైతం వైసిపికే అనుకూలంగా వుండే అవకాశముంది.

జిల్లా పరిషత్ ఎన్నికల్లో 24జడ్పీటీసీలను సాధించుకున్న పార్టీకే ఛైర్మెన్ పీఠం దక్కుతుంది. ఇండిపెండెంట్లుగాని, ఇతర పార్టీలు గాని ఎక్కడా ఒక్క జడ్పీటీసీని కూడా గెలుచుకునే అవకాశం లేదు. పోటీ అంతా వైసిపి–టీడీపీల మధ్యే!


# ఒక అంకం ముగిసింది

## రెండు మిగిలాయి



బారులు తీరిన ఓటర్లు





కలెక్టర్ ఓటు ఎవరికో?

**జిల్లా అధికారయంత్రాంగం మున్సిపల్స్ అనే హర్డిల్‌ను విజయవంతంగా దాటింది. నెల్లూరు నగర పాలకసంస్థతో పాటూ కావలి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, ఆత్మకూరులలో మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ముగించగలిగారు. ఇది అధికార యంత్రాంగం విజయమే. ఒక అంకం పూర్తి కావడంతో అధికారులకు, పోలీసులకు కాస్త ఉపసమనం లభించినట్లయ్యింది.**

ఆదివారం జరిగిన పురపోరులో ఓటర్లు ఇనుమడించిన ఉత్సాహంతో పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగగా ఎండ కారణంగా ఉదయం సమయంలో, సాయంత్రం సమయంలో పోలింగ్ ఎక్కువగా జరిగింది. నెల్లూరు కార్పొరేషన్‌లో 4,41,708ఓట్లకు గాను 2,66,438(60.32%) మంది ఓట్లు వేసారు. కావలి మున్సిపాల్టీలో 73.42శాతం, గూడూరులో 71.50శాతం, వెంకటగిరిలో 79.10శాతం, ఆత్మకూరులో 72.57శాతం, సూళ్లూరుపేటలో 69.81శాతం, నాయుడుపేటలో 65.17శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు జరిగాయి. తీవ్రమైన సంఘటనలేవీ లేవు. నెల్లూరునగరపాలక సంస్థ ఓటర్ల జాబితా గందరగోళంగా మారడంతో పోలింగ్ శాతం తగ్గింది. లేదంటే ఇంకా పెరిగిఉండేది. మనిషి ఉండేది ఒక డివిజన్‌లో అయితే ఓటు వేయాల్సింది ఇంకో డివిజన్‌గా ఉండడం, ఓటర్ల స్లిప్పులను సరిగా పంపిణీ చేయకపోవడం, తమ ఓటు ఏ బూత్‌లో వుందో ఓటరుకు స్పష్టంగా తెలియకపోవడంతో చాలామంది ఓటేసే అవకాశాన్ని కోల్పోయారు. ఈసారి ఓటర్ల స్లిప్పులను ప్రభుత్వం తరపునే ఇంటింటికి పంపిణీ చేస్తారని చెప్పినా అది సక్రమంగా అమలు జరగలేదు. ఓటర్లు ఐడి కార్డులు పట్టుకుని వచ్చి పోలింగ్‌బూత్‌ల వద్ద కొచ్చి తంటాలుపడ్డారు. నెల్లూరు కార్పొరేషన్ 54వ డివిజన్‌లో సిబ్బంది పంపిణీ చేసిన ఓట్ల స్లిప్పులకు ఓటర్లజాబితాకు పొంతన లేకపోవడంతో గందరగోళం నెలకొంది. మూడుగంటలు ఆలస్యంగా ఇక్కడ పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ సమయంలో కొన్నిచోట్ల సమయానికి ఆహారం అందక పోలింగ్ సిబ్బంది అల్లాడారు. ఎండ ఎక్కువగా ఉండడంతో సిబ్బంది, ఓటర్లు ఇబ్బందికి గురయ్యారు. మొత్తం మీద పోలింగ్‌ను ప్రశాంతంగా ముగించినందుకు కలెక్టర్, ఎస్పీలు ఊపిరి పీల్చుకున్నారు. ఇక జడ్పీ, సార్వత్రిక ఎన్నికల హర్డిల్స్‌ను వాళ్లు దాటాల్సి ఉంది.

# కమలంకు ఆత్మకూరే!

## అభ్యర్థిగా ఆంజనేయరెడ్డికే అవకాశం



సీమాంధ్రలో తెలుగుదేశం, బీజేపీల మధ్య పొత్తు కుదిరితే బీజేపీ జిల్లాలో ఎక్కడనుండి పోటీ చేస్తుందనే దానిపై చర్చ జరుగుతుంది. బీజేపీ నాయకులు నెల్లూరు లోక్‌సభతో పాటు ఆత్మకూరు, సర్వేపల్లి అసెంబ్లీ సీట్లను కోరే అవకాశాలున్నాయి. అయితే ఇప్పటికే నెల్లూరు పార్లమెంటు స్థానానికి తెలుగుదేశం అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నిర్ణయించేసారు. బీజేపీకి ఇస్తామన్న నాలుగు లోక్‌సభ సీట్లను కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో కేటాయించే అవకాశాలున్నాయి. సీమాంధ్రలో బీజేపీకి ఇస్తామన్న అసెంబ్లీ సీట్లు 12. కాబట్టి ఒకే జిల్లాలో రెండు సీట్లు కేటాయించడం కుదరకపోవచ్చు. సర్వేపల్లి, ఆత్మకూరులలో దేనినైనా బీజేపీకి వదులుకోవడానికి తెలుగుదేశం సిద్ధంగా వుంది. ఈ రెండూ కూడా ఆ పార్టీ ఆశలు వదులుకున్న సీట్లు. కాబట్టి ఏ సీటైనా బీజేపీకి ఇచ్చేస్తుంది. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి సర్వేపల్లి సీటువైపు మొగ్గుచూపే అవకాశముంది. సర్వేపల్లి ఇస్తే

(మిగతా 10వ పేజీలో)

# 'జయం' సాధించేనా?

## సమైక్యాంధ్రకు జైకొట్టేదెవరు



జిల్లాలో జైసమైక్యాంధ్ర పార్టీకి ఆనం జయకుమార్‌రెడ్డే బలమైన నాయకుడిగా మిగిలాడు. జైసమైక్యాంధ్ర పార్టీ భారాన్ని ఆయనే భుజాలకెత్తుకున్నాడు. మొదట జిల్లాకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు కిరణ్ పెట్టబోయే పార్టీలో చేరుతారని భావించారు. అయితే చాలామంది నాయకులు కిరణ్‌కు హ్యాండిచ్చి టీడీపీలోకో, వైసిపిలోకో వెళ్లిపోయారు. జిల్లాలో ఆనం జయకుమార్‌రెడ్డి, వై.సుమంత్‌రెడ్డిలు తప్ప పేరుమోసిన నాయకులెవరూ జైసమైక్యాంధ్ర పార్టీలో లేరు. ఆనం జయకుమార్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో నెల్లూరురూరల్ లేదా నెల్లూరుసిటీ స్థానాలలో పోటీచేసే అవకాశముంది. పార్టీకి జిల్లా నాయకత్వం వహించేది కూడా ఆయనే. జిల్లాలోని నెల్లూరు లోక్‌సభ, 10అసెంబ్లీలకు అభ్యర్థులను నిలబెట్టే అవకాశముంది. అయితే జయకుమార్‌రెడ్డి ఒంటరి పోరాటం ఎంతవరకు ఫలిస్తుందో?



## మారుతున్న పార్టీల ట్రెండ్ మారని ఓటర్ మైండ్

## సీమాంధ్రలో

# పెరుగుతున్న ఫ్యాన్ స్పీడ్

ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టి రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా చేసి పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తున్న సోనియాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్‌పార్టీకి అటు తెలంగాణలోనూ ఇటు సీమాంధ్రలోనూ అడ్రస్ గల్లంతయ్యే ఎన్నికలు ఇక్కడ జరగబోతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ మొత్తం ఖాళీ అయిపోయి టిక్కెట్లిస్తున్నాం బాబు దరఖాస్తు చేసుకోండి అని ప్రకటనలిచ్చేస్థాయికి దిగజారిపోయింది. ఈ అవకాశాన్ని బాగా సద్వినియోగం చేసుకున్న తెలుగుదేశంపార్టీ కాంగ్రెస్ నాయకగణాన్ని మొత్తాన్ని తమ పార్టీకి ఆహ్వానించేసింది. అయితే తెలుగుదేశం పార్టీ గూటికి చేరడం చాలామందికి ఇష్టం లేనప్పటికీ వైకాపా నోవేకన్సీ బోర్డు పెట్టేయడంతో దేశం వైపు దృష్టిసారించారు.

వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావం నుండే జగన్ వెంట నడచిన వారికే ఆ పార్టీ ప్రాధాన్యత కల్పించింది. ఒకటీ అరా మినహా ఎక్కడా అభ్యర్థులను పెద్దగా మార్చే పరిస్థితి లేదు. ముందు నుండే నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించిన వారినే రేపు జరగబోయే ఎన్నికలలో అభ్యర్థులుగా కూడా ప్రకటించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఆడిన మాట తప్పకపోవడం అయినవారిని ఆదరించడం నాన్న నుండి నేర్చుకున్న లక్షణాలుగా జగన్‌లో స్పష్టంగా కనిపిస్తుండడంతో ఆయన ఆశీస్సులు పొందిన వారు తమకేం ఢోకాలేదని ధీమాగా వున్నారు.

అనుకోకుండా జరిగిన రాష్ట్ర విభజన ప్రక్రియ అనంతరం కాంగ్రెస్‌పార్టీ బొక్క బోర్లపడి నాయకగణమంతా తలా ఒక దిక్కుకు పరుగెత్తే సమయంలో వైకాపా గెట్లు మూసేసి హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేయడంతో హస్తం నేతలంతా సైకిలెక్కి కూర్చున్నారు. అతికొద్ది మంది మాత్రం బీజేపీ వైపు మొగ్గు చూపగా ఎక్కువశాతం మంది బాబుపంచన చేరారు. నిన్నటి వరకూ లోగ్రాఫ్‌తో వుండిన తెలుగుదేశం పార్టీకి కొత్తనీరు రాకతో కళొచ్చింది. పార్టీ క్యాడర్‌లో ఆత్మస్థైర్యం పెరిగింది. తాము కూడా బలంగా వున్నామన్న నమ్మకం ఏర్పడింది.

రాష్ట్రంలో పోటీచేస్తున్న పార్టీలన్నీ ఒక్కొక్క పార్టీ ఒక్కో నినాదంతో ప్రజల ముంగిళ్ళకు వెళ్తుంది. తెలుగుదేశం పార్టీ రుణమాఫీతో పాటు తక్కువ ధరకు భోజనం అంటూ జయలలిత ఫార్ములాను ఫాలో అవుతోంది. ఆయనున్నప్పుడే బాగుండింది అంటూ పది సంవత్సరాల క్రితం వున్న తెలుగుదేశం పాలనను మళ్ళీ ప్రజలకు గుర్తు చేస్తూ టీవీల్లో, సినిమాల్లో ప్రకటనల ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. చంద్రబాబు ఒక్కడే సీమాంధ్రను స్వర్ణాంధ్రగా మార్చగలడని బల్లగుద్ది చెప్తోంది.

ఇక కాంగ్రెస్ పార్టీ గత పది సంవత్సరాలలో వై.యస్ స్ఫూర్తితో తాము చేసిన ఘనకార్యాలను ఏకరువు పెడుతూ రాష్ట్ర విభజన మన ఖర్మ కొద్దీ జరిగిందంటూ ప్రజాకోర్టుకు వెళ్తోంది. చిరంజీవి గ్లామర్‌తో పెద్ద లాభం పొందాలనే ప్రయత్నం పెద్దగా ఫలించకపోవడంతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ మళ్ళీ కాంగ్రెస్సే అధికారంలోకి వస్తుందన్న పచ్చి అబద్ధంతో తమను తామే మోసం చేసుకుంటూ కాంగ్రెస్ నాయకులు ప్రజాయాత్రలు చేస్తున్నారు.



జాతీయ పార్టీ బీజేపీకి రాష్ట్రంతో పనిలేదు. కేంద్రంలో మోడీని ప్రధానిని చేయడమే ప్రధాన లక్ష్యంగా చేసుకుని దేశాన్ని పరిపాలించే సత్తా కేవలం మోడీలాంటి సమర్థత కలిగిన నాయకుడికి బీజేపీలాంటి సత్తా కలిగిన పార్టీకే వుందంటూ పూదరగొడుతోంది. అటు తెలంగాణలోనూ ఇటు సీమాంధ్రలోనూ తెలుగుదేశంతో చేయి కలిపి "కమలంతో నా ప్రయాణం" సుఖవంతం లాభతరం అని భావిస్తున్న చంద్రబాబుకి బాసటగా నిలిచింది. ఇప్పటికే మతతత్వ పార్టీ అంటూ బీజేపీపై విరుచుకుపడుతున్న ఓ వర్గం ప్రజలకు తెలుగుదేశం సైతం దూరమైపోయింది. తెలుగుదేశంతో పొత్తు బీజేపీకి లాభమా లేక బీజేపీతో పొత్తు తెలుగుదేశానికి నష్టమా అన్న విషయం ఆ పార్టీ నేతలే తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడిపోయింది.

ఇక వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ విషయానికొస్తే ఆ పార్టీకి ఏకైక ప్లస్ పాయింట్ వై.యస్ ఇమేజ్. 2004 నుండి ఆంధ్రప్రదేశ్‌ను వైయస్ రాజశేఖరరెడ్డి పరిపాలించిన తీరు కొన్ని లక్షల కుటుంబాల్లో ఆనందాలను నిలిపిందన్నది ఎవ్వరూ కాదనలేని నిజం. నాడు వై.యస్. ప్రవేశపెట్టిన పథకాలను చూపెట్టుకుని అటు కాంగ్రెస్, అవే పథకాలను మరింత మెరుగ్గా అమలు చేస్తామని ఇటు వై.సి.పి. రెండూ ప్రజలకు ఒకే పథకాలను ఆశగా చూపిస్తున్నాయి. ఎప్పుడో పదేళ్ళ క్రితం పరిపాలించిన బాబును పదేపదే విమర్శిస్తూ, వై.యస్ ఆశయాలే తమ పార్టీ ధ్యేయమంటూ వైయస్ఆర్ కాంగ్రెస్ ముందుకు వెళ్తోంది.

అయితే అన్ని పార్టీలూ ఎవరికి తోచిన నినాదాలతో వాళ్ళు తమ బ్రాండ్‌ను పాపులర్ చేసే దిశగా తమ ట్రెండ్‌ను క్రియేట్ చేసుకోవాలనే లక్ష్యంతో ప్రయత్నాలు సాగిస్తుంటే ఓటర్ మైండ్ మాత్రం మారలేదు. గత నాలుగున్నరేళ్ళుగా వాళ్ళు ఒక మైండ్‌సెట్‌తో వున్నారు. వై.యస్.రాజశేఖర్‌రెడ్డి కుమారుడు జగన్మోహన్‌రెడ్డిని ఒక్కసారి ముఖ్యమంత్రిగా చూడాలి. ఇదే వారి లక్ష్యం, ఇదే వారి ఆశయం, ఇదే వారి ధ్యేయం. ఎంత మంది నేతలొచ్చినా ఎన్ని పూకదంపుడు ఉపన్యాసాలిచ్చినా అందరినీ స్వాగతిస్తూ అన్నీ వింటూ తమ నిర్ణయం మాత్రం తాము చేసేసుకున్నారు.

ముఖ్యంగా జాతీయపార్టీ అధినేత్రి సోనియా గాంధీని "జగన్" ఎదిరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అతి చిన్న వయస్సులో ఓ వైపు అభియోగాలను ఎదుర్కొంటూనే మరోవైపు అధికారంలో వున్న కాంగ్రెస్‌పార్టీని ఎదిరించే జగన్ శైలి అందరినీ ఆకట్టుకుంది. ఒక్కసారి ఖచ్చితంగా ఈ పిల్లోడికి ఓటేయ్యాలనే దృఢ నిశ్చయంతో వున్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఎవరెన్ని రాతలు వ్రాసినా ప్రజలు మాత్రం "జగన్" పేరుని తమ గుండెల్లో ముద్రించుకుని రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నారని స్పష్టమౌతుంది. రాష్ట్రంలో వీయబోయేది ఫ్యాన్ గాలేనన్నది రాజకీయ మేధావులు చెప్తున్న జోస్యం.





### వై.కా.పా నేతలకు అగ్నిపరీక్షగా

## నెల్లూరు నగర ఫలితాలు..!

నెల్లూరు నగరపోరు ముగిసింది. ఇక ఫలితాలే తరువాయి. జిల్లాలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి పెద్దరికంలో గౌతంరెడ్డి నాయకత్వంలో నడుస్తున్న వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీకి ఈ ఫలితాలు పెద్ద సవాల్‌గా మారనున్నాయి. దాదాపు 5దశాబ్దాల తరువాత మైనారిటీలకు పెద్దపీట వేస్తున్నామంటూ తమ అనుచరుడు అజీజ్‌ని మేయర్ అభ్యర్థిగా బరిలో దింపారు మేకపాటి సోదరులు. అయితే నగర కార్పొరేషన్ ఎన్నికలు ముఖ్యంగా నెల్లూరు నగరం, గ్రామీణం, సర్వేపల్లి, నియోజకవర్గాలతో ముడిపడి వుండడంతో అభ్యర్థుల ఎంపిక ఈ పార్టీకి కొంచెం కష్టతరమైంది.



మేకపాటి నాయకత్వంలో ఓ వైపు పనిచేస్తూనే మరో ప్రక్క తమకంటూ ఓ వర్గాన్ని తమదంటూ ఓ ముద్రని వేసుకునే ప్రయత్నం కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌లు చేస్తున్నారన్న విషయం జగమెరిగిన సత్యం. అయితే విచిత్రమయిన పరిస్థితులలో మేయర్ అభ్యర్థిగా మేకపాటి అనుచరుడి పేరు ప్రకటించబడడంతో వీరి ముగ్గురి పరిస్థితి ఇరకాటంలో పడిందనే చెప్పవచ్చు. పార్టీ విజయం కోసం తాము నిలబెట్టుకున్న కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు కోసం వీళ్ళు ఎంత కష్టపడ్డా పోరపాటున అజీజ్ మేయరయ్యే స్థాయిలో ఫలితాలు వెలువడకపోతే ఆ నేరం ఈ ముగ్గురిపైనా పడే ప్రమాదం లేకపోలేదు. ఎవరి ఆధిపత్యాన్ని వారు ప్రదర్శించుకునే ప్రయత్నంలో ప్రక్కవార్డు అభ్యర్థులను వెన్నుపోటు పొడవనున్నారనే సమాచారం హైదరాబాదు వైకాపా నేతలకు చేరడంతో నెల్లూరులో ఓ దూత ద్వారా వీరందరినీ మందలించినట్లు సమాచారం. పార్టీ విజయమే అందరి లక్ష్యంగా పనిచేయాలని ఇక్కడ ఆధిపత్య పోరు కోసం ప్రయత్నించి వెన్నుపోటుకు పూనుకుంటే పార్టీ ఇరకాటంలో పడుతుందని అలాంటి పరిస్థితే వస్తే మీ టిక్కెట్లు గల్లంతవుతాయని వీరిని ఆ దూత హెచ్చరించినట్లు తెలిసింది.

ముఖ్యంగా శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌లను కొంచెం గట్టిగానే మందలిస్తూ మీరు ఐకమత్యంగా వుండాలని లేకపోతే పరిస్థితులు తారుమారై మీ టిక్కెట్లను కోల్పోయే పరిస్థితి వస్తుందని చెప్పినట్లు వార్త.

నిజమే... నెల్లూరులో వెన్నుపోటు రాజకీయాలకు కొరవలేదు. ఆ వెన్నుపోట్లతోనే 2009 ఎన్నికలలో అనిల్‌కుమార్ యాదవ్ ఓటమి పాలయ్యారు. ఇలాంటి ఉదాహరణలు జిల్లాలో ఎన్నో వున్నాయి. కాంగ్రెస్ పెద్ద తల నేదురుమల్లికి ఈ వెన్నుపోట్లు వెన్నతోపెట్టిన విద్య. ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన చాలా మందికి ఆయన అలవాట్లే వంటబట్టాయి. కానీ... వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో ఆ పప్పులు ఉడకవ్. ఎక్కడైన తేడా జరిగినట్లు జగన్‌కు తెలిస్తే తాటతీస్తాడు. ఆ విషయం ఈ నేతలందరికీ తెలుసు. జగన్ హవాతో తమ జీవితాశయాన్ని నెరవేర్చుకోవాలని చూస్తున్న ఈ యువ నాయకగణం అంతటి సాహసానికి పూనుకోలేదనే భావించాలి. ఎన్నికల ముందు ఆ తరువాత పరిస్థితులను గమనిస్తే "ఫ్యాన్" పోలింగ్‌లో బాగానే కనిపించిందని రాజకీయ ఉద్దండులు చెప్తున్నారు. ఆల్ ది బెస్ట్ టు యంగ్ లీడర్స్.






## సంగీత సభ ఉగాది వేడుకలు



నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని జూ॥రేబాలలక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో మార్చి 31న పురమందిరం సౌజన్యంతో విక్రమ సింహపురి సంగీతసభ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు వైభవంగా జరిగాయి. తొలుత లాయర్ వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా సంకీర్తనాకోకిల జె.బాలార్క ప్రార్థనాగీతం ఆలపించారు. జ్యోతిష్య విద్యావిశారద స్వయంపాకుల శ్రీనివాసులు పంచాంగం విశదంగా పఠనం చేసారు. జయనామ సంవత్సరంలో దేశంలో నెలకొనే ఆర్థిక, సాంఘిక, రాజకీయ సంఘటనలు, ధరలు, రాశిఫలితాలు సోదాహరణగా వివరించారు. తదుపరి ఆయనను అతిథులు నూతన వస్త్రాలు, శాలువతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల విద్యార్థులు చక్కని కూచిపూడి నృత్యప్రదర్శనతో అందరినీ అలరించారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులకు ఉగాది పురస్కారాలందించారు. కార్యక్రమంలో వాకాటి విజయకుమార్‌రెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, వీరిశెట్టి హజరత్‌బాబు, పంచాగ్నుల వెంకట విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. సహస్ర సభాసింహం బి.వి.నరసింహం తనదైన శైలిలో సభను నిర్వహించి అందరి హర్షధ్వానాలు అందుకున్నారు. నెల్లూరుజిల్లా దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ప్రసాదం సభికులకు పంపిణీ చేయడం జరిగింది.




## ఇవేం ఎన్నికలు బాబో...

ఎన్నికలు చాలా నీచంగా తయారయ్యాయి. ఓటర్లు అంత కంటే దరిద్రంగా మారారు, ఓటుకు డబ్బులిస్తే చాలు... అభ్యర్థి ఖూనీ కోరా, రేపిస్టా, శాడిస్టా అన్నది కూడా చూడడం లేదు. ఎవరు మంచి అభ్యర్థి, ఎవరు సమర్థులనే దానినే పరిగణనలోకి తీసుకోవడం లేదు. డబ్బులిచ్చారా లేదా అనే చూస్తున్నారు. ఓట్లకు డబ్బులు తీసుకున్నందువల్ల ప్రజలు ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కును కోల్పోతున్నారు.

వి.నవీన్, నెల్లూరు.

## దేశాన్ని మార్చే నాయకత్వం కావాలి

మన దేశంలో చాలా వ్యవస్థలు భ్రష్టుపట్టి ఉన్నాయి. సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయి. అన్ని వ్యవస్థలను పటిష్టపరిచి వాటి చేత పనిచేయించగల సమర్థవంతమైన నాయకత్వం దేశానికి అవసరం. నరేంద్రమోడీ లాంటి నాయకుడితోనే అది సాధ్యమవుతుంది.

జి.వి.ప్రభాకర్, చీమకుర్తి.

## ప్రత్యక్ష ఎన్నికలు కావాలి

నగరపాలక సంస్థ మేయర్, మున్సిపల్ ఛైర్మెన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. దీనివల్ల ప్రజలు కోరుకున్న నాయకులు మేయర్ లేదా ఛైర్మెన్‌లుగా ఎన్నికయ్యే అవకాశముంది. గతంలో ఈ విధానమే అమలులో ఉండింది. కాంగ్రెస్ ప్రభుత్వం దానిని తీసేసి పరోక్ష విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనివల్ల ఎన్నికల ప్రక్రియ అంతా అడ్డదిడ్డంగా ఉన్నట్లుంది.

జి.సుజాత, నెల్లూరు.

## సొంత డబ్బాలొద్దు

ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో పార్టీకి ఒక్కో పత్రిక అన్నట్లుగా వుంది. ఆ పత్రికలు చదువుతుంటే విసుగు పుడుతుంది. సొంత భజనలు తప్పితే నిజమైన వార్తలు ఏవీ కనిపించడం లేదు. రాష్ట్రంలో ఇక వార్తలే లేనట్లు వారి వారి పార్టీల గురించి గొప్పగా వ్రాసేందుకు పేజిలు సరిపోతున్నాయి. ఒక్కో పత్రిక సర్వే ఒక్కోలా వుంటుంది.

ఎన్.ఎస్.బాబు, నెల్లూరు.

## 'ప్రభా'తం

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం



**మూడు దశాబ్దాల క్రితం దాకా కూడా ఎన్నికలు ఎంతో హుందాగా జరిగేవి. పోటీలో వున్న అభ్యర్థులకు జెండాలు, కరపత్రాల ఖర్చు తప్పితే ఇంకేమీ వుండేది కాదు. ఇలా గెలిచిన అభ్యర్థులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనులు చేస్తుండేవాళ్లు. ప్రభుత్వ పరంగా చేసేపనుల్లో కూడా నిజాయితీ ఉండేది.**

ఇంకో పదేళ్ల తర్వాత దేశంలో ఎన్నికలు ఎలా ఉంటాయి. వివిధ రాజకీయ పార్టీలను కార్పొరేట్ కంపెనీలు దత్తత తీసుకుంటాయి. చిల్లరవర్తకంలోకి ఎఫ్‌డిఐలను ఆహ్వానించినట్లు భారత రాజకీయాలలోకి బహుళజాతి సంస్థల పెట్టుబడులను కూడా ఆహ్వానించవచ్చు. ఇలా విదేశీ, స్వదేశీ కంపెనీలు పలు రాజకీయపార్టీలకు పెట్టుబడిదారులుగా మారుతాయి. ఆయా పార్టీల తరపున పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులను కూడా ఈ కంపెనీలే నిర్ణయిస్తాయి. ఎన్నికల్లో ఈ కంపెనీలే అభ్యర్థుల తరపున ఖర్చును భరిస్తాయి. కోట్లు వెదజల్లుతాయి. ఓట్లు కొంటాయి. పార్లమెంటులో తమతమ కంపెనీల తరపున ప్రతినిధులను ఎంపీలుగా కూర్చొబెడతాయి. ఈ కంపెనీలకు అవసరమైన చట్టాలనే ఈ పార్లమెంటుసభ్యులు చేసుకుంటూ పోతుంటారు. ఇప్పటికే విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం వంటివన్నీ కూడా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇక రాజకీయమే మిగిలివుంది. అది కూడా త్వరలో కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతుందేమోననిపిస్తుంది.

ప్రజాస్వామ్యం ప్రమాదం అంచుల్లోవుంది. మన ప్రజాస్వామ్య విలువలను మనమే తగులబెట్టుకుంటున్నాం. దేశంలో ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థ అత్యంత నికృష్టంగా తయారైంది. ఎన్నికలు ఒక పద్ధతి, పాడు లేకుండా జరిగిపోతున్నాయి. ఓటుకు నోటుతో విలువకడుతూ వెలకట్టలేని విలువైన ఓటును తప్పుదారి పట్టిస్తున్నారు. రాజకీయాలు ఒక వ్యాపారంగా మారుతున్నాయి. ఎన్నికల్లో సీటు కావాలంటే పార్టీలకు డబ్బులిస్తున్నారు. ఓట్లు కావాలంటే జనానికి డబ్బులిస్తున్నారు. ఈరోజు ఓట్ల కొనుగోలుకు పెడుతున్న డబ్బును నాయకులు పెట్టుబడిగా చూస్తున్నారు. పదవిలో వున్న ఐదేళ్లు రాబడి చూసుకుంటున్నారు. ఇదెలా ఉంటుందంటే నాలుగులైన్ల రోడ్లు వేసాక మలేషియా కంపెనీవాళ్లు టోల్‌ప్లాజాలు పెట్టి వాహనాల వద్ద నుండి టోల్‌ఫీజు వసూలు చేస్తున్నట్లుగా వుంది. డబ్బుతో ఎన్నికలు చేయాలనేది అన్ని పార్టీలు ఒక సిద్ధాంతంగా పెట్టుకున్నాయి. ఆయా పార్టీలు కోట్లు ఖర్చుపెట్టుకోగల నాయకులకే సీట్లిస్తున్నాయి. ఇప్పుడు అన్నాహజారే ఏ పార్టీలోనన్నా చేరి ఎక్కడనుండన్నా పోటీ చేయాలనుకుంటే మన రాజకీయపార్టీల వారు ఆయనను ముందుగా అడిగే మాట పార్టీకి ఎంతిస్తావ్, నియోజకవర్గంలో ఎంత ఖర్చుపెట్టగలవు?

రాజకీయపార్టీలు ఇంత దరిద్రంగా ఎందుకు తయారయ్యాయంటే దానికి కారణం ప్రజలే! వాళ్లు ఓట్లు అమ్ముకుంటున్నారు. కాబట్టి పార్టీలు కొంటున్నాయి. ఇటీవల రాష్ట్రంలో జరిగిన మున్సిపల్, స్థానిక ఎన్నికలనే పరిశీలిద్దాం. ఓటుకు 500రూపాయల నుండి 3వేల రూపాయల దాకా ధరపలికింది. అంటే ఓటు ఏ స్థాయికి దిగజారిందో ఇక్కడ తెలుస్తుంది. దేశం తనకు కల్పించిన ఓటు హక్కును పౌరుడు మార్కెట్‌లో పెట్టేస్తున్నాడు. ప్రజాప్రతినిధులు ఈ హక్కును కొనేస్తున్నారు. రేపు ఆ ప్రజాప్రతినిధిని ప్రశ్నించే హక్కును ప్రజలు కోల్పోతున్నారు. డబ్బు, మద్యం చుట్టూ తిరుగుతున్న నేటి రాజకీయ ప్రపంచంలోకి సామాన్యులు, మేధావులు, నిజాయితీ పరులు అడుగుపెట్టే పరిస్థితి లేకుండాపోయింది. సాక్షాత్తూ గాంధీ మహాత్ముడు, స్వామి వివేకానందులు ఇప్పుడు మన మధ్య వుండి ఏదో ఒక పార్టీ తరపున ఎన్నికల్లో పోటీచేసి ఓట్లడగడానికి పోయారనుకోండి... మా ఇంట్లో నాలుగు ఓట్లున్నాయి, ఓటుకు వెయ్యి లెక్కన నాలుగువేలివ్వండి అని అవతలివాళ్లు చెయ్యి చాపే పరిస్థితి. కొన్నేళ్ల క్రితం కేవలం కొన్నికాలనీలకు మాత్రమే ఓట్ల కొనుగోలు వ్యవహారం పరిమితమై ఉండేది. కాని ఇప్పుడు మధ్యతరగతి వారిని దాటి ఉన్నత వర్గాల వారికి కూడా ఈ ఓటుకు నోటు ఫోబియా పాకిపోయింది.

మూడు దశాబ్దాల క్రితం దాకా కూడా ఎన్నికలు ఎంతో హుందాగా జరిగేవి. పోటీలో వున్న అభ్యర్థులకు జెండాలు, కరపత్రాల ఖర్చు తప్పితే ఇంకేమీ వుండేది కాదు. ఇలా గెలిచిన అభ్యర్థులు నిత్యం ప్రజలకు అందు బాటులో ఉంటూ వారికి కావాల్సిన పనులు చేస్తుండేవాళ్లు. ప్రభుత్వ పరంగా చేసేపనుల్లో కూడా నిజాయితీ ఉండేది. క్రమక్రమంగా రాజకీయాలను డబ్బు ఆక్రమించేసింది. 1980 దశకం చివరిలో ప్రవేశించిన ఈ డబ్బు సంస్కృతి 90వ దశకంలో ఊపందుకుంది. 21వ శతాబ్దంలోకి ప్రవేశించాక దానిదే పైచేయి అయ్యింది. 5ఏళ్ల పాటు ఒక కార్పొరేటర్‌గానో, ఎమ్మెల్యేగానో సేవలందించిన నాయకుడు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఓటర్లకు డబ్బులు ముట్టజెప్పాల్సిన పరిస్థితి వచ్చింది.

దేశ ప్రజాస్వామ్యానికి ఇది చాలా ప్రమాదకరం. ఓటుకు నోటు సంస్కృతి ఇలా పెరుగుతూపోతే త్వరలోనే దేశంలోని చట్టసభలను కార్పొరేట్ కంపెనీలు ఆక్రమించడం ఖాయం. ఈ ప్రమాదం నుండి బయటపడాలంటే ముందు మన ఎన్నికల వ్యవస్థను, విధానాన్ని మార్చాలి. విదేశాలలో అమలులోవున్న కొన్ని ఎన్నికల విధానాలను పరిశీలించాలి. చైతన్యం కలిగిన వారికే ఓటు హక్కు కల్పించాలి. ఎన్నికల షెడ్యూల్‌నంతా కూడా రెండుమూడ్రోజులకు కుదించాలి. ఎన్నికల విధానంలో సమూలమార్పులు తేకుంటే కాంట్రాక్టర్లు, కార్పొరేట్ కంపెనీలు దేశాన్ని శాసిస్తాయి.

## 'అంతర్'జాతీయం

- ఎన్నికల కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమీషన్, కాగ్, సిబిఐలు స్వతంత్ర నిర్ణయాలతో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాయని భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ప్రశంసించారు. మార్చి 30వ తేదీ ఢిల్లీలో జరిగిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వజ్రోత్సవ వేడుకలో ఆయన మాట్లాడుతూ చట్టం ద్వారా శాసన బద్ధంగా ఏర్పాటైన ఈ సంస్థలు కొన్ని సందర్భాలలో ప్రభుత్వం, వివిధ వర్గాల నుండి విమర్శలు ఎదుర్కొంటున్నాయని అన్నారు.
- చిదంబరం ఆర్థిక విధానాలతోనే దేశం దివాళా తీసిందని బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి ధ్వజమెత్తారు. ఎన్డీఏ హయాంలో ఆర్థిక వృద్ధిరేటు 8.4శాతం ఉంటే యూపిఏ సర్కార్ దానిని 4.8శాతానికి దిగజార్చిందన్నారు.
- సాధారణ ఎన్నికల్లో ఓటర్లు నిజాయితీగా ఓట్లేయాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. నేరగాళ్లను, అవినీతిపరులను పాతరేసి అభివృద్ధిని కాంక్షించే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరింది.
- బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీని ముక్కలు ముక్కలుగా నరికేస్తానని విద్వేషపూరితంగా మాట్లాడిన యూపిలోని సహరాన్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్‌మసూద్‌ను పోలీసులు అరెస్ట్ చేసారు. మెజిస్ట్రేట్ ఆయనకు బెయిల్ నిరాకరిస్తూ 14రోజుల రిమాండ్ విధించారు.
- రాజస్థాన్‌లోని బార్మేర్ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన జశ్వంత్‌సింగ్‌ను బీజేపీ నుండి ఆరేళ్లపాటు బహిష్కరించారు.
- భారత్‌లో అమెరికా రాయబారి నాన్సీపావెల్ తన పదవికి రాజీనామా చేసారు. ఆమె రాజీనామాను అధ్యక్షుడు ఒబామాకు సమర్పించారు. భారత్‌లో నరేంద్ర మోడీ ప్రధానిరేసులో వున్న నేపథ్యంలో ఆ దిశగా సంబంధాలను బలోపేతం చేయడం కోసమే అమెరికా అధ్యక్షుడు ఆమె చేత రాజీనామా చేయించినట్లు తెలుస్తుంది.
- నరేంద్ర మోడీ భారత ప్రధాని అయితే ఆయన వీసాపై ఉన్న నిషేధం దానంతట అదే రద్దవుతుందని అమెరికా స్పష్టం చేసింది. మోడీకి దౌత్యపరమైన ప్రత్యేకరక్షణ కూడా ఉంటుందని అమెరికా వెల్లడించింది.
- ఖలిస్థాన్ తీవ్రవాది దేవేందర్‌పాల్‌సింగ్ భుల్లార్‌కు అంతకుముందు విధించిన మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. 1993లో ఢిల్లీలో జరిగిన బాంబుపేలుళ్లలో భుల్లార్ నిందితుడిగా ఉన్నారు. ఆ పేలుళ్లలో 9మంది మరణించారు. అప్పటి యువజన కాంగ్రెస్ విభాగం అధ్యక్షులు ఎం.ఎస్.బిట్టా తీవ్రగాయాలపాలయ్యారు. భుల్లార్ మరణశిక్షను యావజ్జీవశిక్షగా మార్చడాన్ని బిట్టా తీవ్రంగా ఖండించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- ఆసుపత్రి ఖర్చుల కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రానీయం. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *మీ ఆస్తులు అమ్మి పెడతారా?***

వార్త :- దళితుల్ని మోసం చేసే కేసీఆర్‌ను తిరగనివ్వం. - మంద కృష్ణ.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్‌నే మోసం చేసిన ఆయనకు మీరో లెఖ్ఖా?***

వార్త :- ఎన్నికల హడావిడిలో విభజన ఏర్పాట్లు. - కిరణ్.
**వ్యాఖ్య :- *మీకంత హడావిడి ఏముంది.***

వార్త :- జాబితాతో ఢిల్లీకి రండి. - రఘువీరాతో దిగ్విజయ్.
**వ్యాఖ్య :- *అభ్యర్థులే దొరక్కుంటే ఆయనేం జాబితా తయారు చేస్తాడు.***

వార్త :- గ్యాస్‌ధర పెంచమన్నది మోడీయే. - అరవింద్ కేజ్రీవాల్.
**వ్యాఖ్య :- *మీరు ప్రభుత్వం కంటే ప్రతిపక్షంపైనే ఎక్కువ గురిపెట్టినట్లున్నారు.***

వార్త :- తెలుగుభాషను రక్షించుకోవాలి. - బీజేపీ నేత వెంకయ్య.
**వ్యాఖ్య :- *తెలుగుభాషతో పాటు తెలుగుదేశాన్ని కూడా రక్షించే పనిలో ఉన్నట్లున్నారు.***

వార్త :- నిత్యావసరధరలు పెరుగుతాయి. - కాంగ్రెస్ పంచాంగ శ్రవణంలో సిద్ధాంతి.
**వ్యాఖ్య :- *కొంపదీసి మళ్లీ కాంగ్రెస్సే వస్తుందా, ఏంటి?***

వార్త :- సాక్షిలో వచ్చే వాటిని చెల్లింపువార్తలుగా పరిగణించాలి. - ఎన్నికల సంఘానికి టీడీపీ లేఖ.
**వ్యాఖ్య :- *మరి ఎల్లో పేపర్లలో వచ్చేవాటిని...!***

వార్త :- ఢిల్లీలో ఎన్నికలు జరపండి. - కేజ్రీవాల్.
**వ్యాఖ్య :- *మళ్లీ హంగే వస్తే...***


వార్త :- నటిస్తూనే... రాజకీయాల్లో కీలకపాత్ర - నందమూరి బాలకృష్ణ.
**వ్యాఖ్య :- *రాజకీయాల్లో కూడా నటించడమేగా!***

వార్త :- సమస్యలు పరిష్కరించేవారికే ఓటెయ్యండి. - యువతకు అబ్దుల్‌కలాం పిలుపు.
**వ్యాఖ్య :- *అలాగనుకుంటే ఎవరికీ ఓటేయబల్లేదు.***

వార్త :- చిరు అభిమానులకు కాంగ్రెస్ గాలం.
**వ్యాఖ్య :- *అవతల పవన్ అభిమానులకు వలనే విసిరి వున్నారు.***

వార్త :- అధికారంలో కాదు, వ్యవస్థలో మార్పు రావాలి. - అన్నా హజారే.
**వ్యాఖ్య :- *ఈ యుగానికి ఆ సంగతి మర్చిపోండి.***

# ఉత్పత్తికి సిద్ధమైన జెన్‌కో!




ముత్తుకూరు మండలం నేలటూరు వద్ద దేశంలోనే ప్రప్రథమంగా ఏపి జెన్‌కో చేపట్టిన 1600మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైనా పవర్‌గ్రిడ్ లైన్ పనులు పూర్తి లేకపోవడంతో పూర్తిస్థాయి ఉత్పాదనకు వీలుకావడం లేదు. మొదటివిడతలో 800 మెగావాట్ల యునిట్‌ను సిద్ధం చేసారు. అయితే ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కాగితాలపూర్ వద్ద నిర్మిస్తున్న గ్రిడ్‌కు అనుసంధానం చేయాల్సి ఉంది. అయితే విద్యుత్‌ను అనుసంధానించే విద్యుత్ లైన్ల పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. గ్రిడ్ విద్యుత్ లైన్ల పనులు పూర్తికాక పోవడంతో కేవలం 45మెగావాట్ల విద్యుత్‌ను మాత్రమే గ్రిడ్‌కు అనుసంధానం చేయగలిగామని జెన్‌కో సిఇ ఎంవివి సత్య నారాయణ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తికి ప్రాజెక్ట్ సిద్ధంగా ఉన్నప్పటికీ మే నెలాఖరు వరకు గ్రిడ్‌లకు అనుసంధానం చేసే పరిస్థితి లేదని ఆయన విలేకరులకు చెప్పుకొచ్చారు. మూడోదశ క్రింద మరో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం అనుమతించిందని, త్వరలో దీనికి టెండర్లు పిలుస్తామన్నారు. బొగ్గు కన్వేయర్ బెల్టు పనులు ఇంకా పూర్తికానందున పోర్టు నుండి రోడ్డు మార్గాన బొగ్గును తెచ్చుకుంటామన్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్ట్‌ను సిద్ధం చేయడం వెనుక ఇంజనీర్లు, కార్మికులు, పరిసరగ్రామాల ప్రజల సహకారం ఎంతైనా వుందంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఇలు నారాయణ మూర్తి, దేవప్రసాద్, చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

# 4 నుండి డిగ్రీ పరీక్షలు

## వియస్‌యు వి.సి



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షలను ఈ నెల 4వతేదీ నుండి నిర్వహిస్తున్నట్లు విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి తెలిపారు. ఈ నెల 1న నెల్లూరులోని విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 19న జరపాల్సిన డిగ్రీ, ఇంటర్ పరీక్షలను ఎన్నికల షెడ్యూల్ మూలంగా వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. మూడు సంవత్సరాలు కలిపి మొత్తం 30,883మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. సంఖ్యాబలం ఎక్కువగా వున్న కళాశాలల విద్యార్థులకు జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షా కేంద్రాలను కేటాయించామన్నారు. సమయపాలన దృష్ట్యా పరీక్షపత్రాలను ఏరోజుకారోజు దిద్దే చర్యలు తీసుకున్నామన్నారు. డికెడబ్ల్యు కళాశాలలో మూల్యాంకనం చేసి మూడు సంవత్సరాల ఫలితాలను ఒకేసారి ప్రకటిస్తామన్నారు. పీజీ ప్రవేశం కోసం తృతీయ సంవత్సర ఇన్‌స్టెంట్ పరీక్షలు కూడా వెంటనే నిర్వహిస్తామన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని, ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని అన్నారు. 41పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికిగాను 41మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 55మంది పరిశీలకులను నియమించామన్నారు. మార్చిలో జరగాల్సిన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవాన్ని గవర్నర్ పాలన, ఎన్నికల కోడ్ మూలంగా మే చివరి వారంలో గాని లేదా జూన్ మొదటి వారంలోగాని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.మురళీమోహన్, నరసింహారావు పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన వైసిపి, కాంగ్రెస్ నేతలు



నెల్లూరు మినీబైపాస్‌లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఈ నెల 1న టిడిపి రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో నెల్లూరు గ్రామీణ మండలం, మాదరాజుగూడూరు ముస్లింపాలెంకి చెందిన వైసిపి, కాంగ్రెస్ నేతలు తెలుగుదేశంపార్టీలో చేరారు. చిరమన శ్రీనివాసులురెడ్డి, సారంగం గున్నయ్యల ఆధ్వర్యంలో షేక్ మహ్మద్‌బాషా, షేక్ మాబాషా, షేక్ కరామత్తు, షేక్ కాలేషా, షేక్ జిలాని, రియాజ్, నిషాద్, షబ్బీర్, కరీముల్లా, షబుల్లా, షాహిద్, అబ్దుల్ తదితర నేతలు 60 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేమిరెడ్డి ఆనందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డా॥ జడ్‌శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## స్థలములు & ఇల్లు అమ్మబడును

**భవానినగర్, కోవూరులో DTCP హైదరాబాద్ వారి అనుమతి పొందిన లే అవుట్ నందు అన్ని వసతులతో, అన్ని ఫేసులలో ఇండ్ల ప్లాట్లు మరియు ఒక డూప్లెక్స్ హౌస్ నార్త్ ఈస్ట్ కార్నర్ తూర్పు ఫేసింగ్ కలది అమ్మకమునకు కలవు.**

కావలసినవారు సంప్రదించండి :

**94415 23251, 99892 87971.**





## పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

**సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు**

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి

31 సంవత్సరములు నిండుతాయి.

ఈ సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు :

**సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

**లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి**

కుమార్తెలు :

**కట్టంరెడ్డి సంయుక్త**

**కేతిరెడ్డి ఉష**

మరియు

**కుటుంబసభ్యులు**

# నెల్లూరు కబుర్లు

## తెలుగు అధికారులు



జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు కస్తూర్బాకళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలకు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్, జిల్లా జడ్జి దుర్గారావు, జాయింట్ కలెక్టర్ రేఖారాణి, అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి తదితరులు అచ్చ తెలుగు పంచెకట్టు, చీర కట్టులతో హాజరై తెలుగుదనాన్ని ప్రతిబింబించారు. వీరి వస్త్రధారణ ఎంతో హుందాగా, చూడ ముచ్చటగా ఉండింది.

## చిల్డ్రన్స్ పార్క్‌లో ఉగాది వేడుకలు



నెల్లూరు ఆదిత్య నగర్‌లోని చిల్డ్రన్స్‌పార్క్‌నందు చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయనామసంవత్సర ఉగాది వేడుకలు ఉల్లాసంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా వేదపండితులచే పంచాగశ్రవణ కార్యక్రమం నిర్వహించి రాబోయే నూతన సంవత్సరంలోని విశేషాలను, స్థితిగతులను వివరించారు. పూజను నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీచేసారు. ప్రత్యేక ప్రసాదమైన "ఉగాది పచ్చడి"ని భక్తులకు పంచారు.

ఈ ఉగాది వేడుకలలో చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్ నాయకుడు టి.వి.ఆర్టిస్ట్ శింగంశెట్టి మురళీమోహన్‌రావు, అసోసియేషన్ సెక్రటరి పాముల రమణయ్య, ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లునాయుడు, శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, సురేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, ఉపాహార్‌శాస్త్రి, డాక్టర్ బాషా, భాస్కర్, సుమంత్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ముదిరిన ఎండలు

వేసవి ప్రతాపం మొదలైంది. ఎండలు రోజురోజుకీ ముదురుతున్నాయి. ఉదయం 11గంటలు దాటిందంటే రోడ్ల మీద తిరిగే పరిస్థితి లేదు. అరగంట రోడ్డు మీద తిరిగితే మాడు మాడిపోతుంది. తలనొప్పి వచ్చేస్తుంది. ఏప్రిల్ నెలారంభంలోనే ఎండలు ఇంత తీవ్రంగా వుంటే మే నెలలో ఇక ఎలా తట్టుకోవాలని జనం ఆందోళన చెందుతున్నారు.

### గవర్నర్ చొరవతో..

## సూక్ష్మసేద్యం పిడీగా పెంచలరెడ్డి



రాష్ట్ర సూక్ష్మసేద్యం ప్రాజెక్ట్ అధికారిగా నెల్లూరుజిల్లాకు చెందిన సి.హెచ్. పెంచలరెడ్డిని నియమిస్తూ ఉద్యానవనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 10 నుండి ఆయన పోస్టింగ్ లేక గాల్లో ఉన్నారు. నెల్లూరుజిల్లా అదనపు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తుండిన ఆయనను అప్పుడు ముఖ్యమంత్రిగా వున్న కిరణ్‌కుమార్‌రెడ్డి సూక్ష్మసేద్యం పిడీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసారు. అయితే ఈ పోస్ట్‌లోకి పెంచలరెడ్డి రావడాన్ని అప్పుడు ఉద్యానవనశాఖ మంత్రిగా వున్న వెంకటరెడ్డి అంగీకరించలేదు. ఆయన నియామక ఫైల్‌ను పక్కన పెట్టేసారు. సూక్ష్మసేద్యంకు రెవెన్యూలో ప్రత్యేక ఉపకలెక్టర్ స్థాయి అధికారిని పిడీగా పెట్టాలనే నిబంధన ఉంది. దానిని మంత్రి విస్మరించారు. సీఎం పదవికి కిరణ్ రాజీనామా చేయడంతో మంత్రివర్గం కూడా రద్దయ్యింది. ఇప్పుడు గవర్నర్ చేతిలోకి అధికారమొచ్చింది. ఆయన ఈ ఫైల్‌ను పరిశీలించి ఎన్నికల సంఘం అనుమతితో నిబంధనలకు అనుగుణంగా సూక్ష్మ సేద్యం పిడీగా పెంచలరెడ్డినే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

### అన్నమయ్యకు

## గానసభ నీరాజనం

మార్చి 28వ తేదీ శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య వర్ధంతిని పురస్కరించుకుని భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ వారు నెల్లూరు మినీబైపాస్‌లోని అన్నమయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మినీ బైపాస్‌రోడ్డులో అన్నమయ్య నగరసంకీర్తన చేసారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజ స్మరణోత్సవసభ కార్యదర్శి వై.నాగదేవీ ప్రసాద్, గాయకులు డి.వి.సురేష్‌రావు, ప్రసాద్, రమాదేవి, లోకేష్‌బాబు, కళాధర్, రవి, వనజ, సత్యవాణిలు పాల్గొన్నారు.

## గేట్‌లో నారాయణ గ్రేట్



కె.విష్ణువర్ధన్‌రెడ్డి

సాంకేతిక విశ్వవిద్యాలయం విడుదల చేసిన గేట్ ఫలితాలలో నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ బ్రాంచ్ విద్యార్థి కె.విష్ణువర్ధన్‌రెడ్డి 242 ర్యాంకు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి విలేకర్లకు వెల్లడించారు. ఈసీ బ్రాంచ్‌లో 22 మంది, ట్రిపుల్‌ఇ బ్రాంచ్‌లో ఏడు మంది, సివిల్‌ఇలో ఒకరు ఈసిఎంలో ఒకరు... ఇలా కళాశాల నుండి 170మంది విద్యార్థులు గేట్ పరీక్షకు హాజరుకాగా వారిలో 31మంది ర్యాంకులు సాధించారని ఆయన వెల్లడించారు.

## ఉపయోగపడిన వెబ్‌సైట్



నెల్లూరు నగరపాలకసంస్థ ఓటర్ల జాబితా గందరగోళంగా మారడం తెలిసిందే! మనిషి ఒక చోట, ఓటు ఇంకో డివిజన్‌లో ఉండడం, భార్య ఒక డివిజన్‌లో భర్త మరో డివిజన్‌లో ఓటర్లుగా వుండడం జరిగింది. ఇలాంటి వారందరికీ జిల్లా కలెక్టరేట్ ఉద్యోగి వై.నాగేశ్వరరావు రూపొందించిన www.spsnellore.com వెబ్‌సైట్ ఎంతగానో ఉపయోగపడింది. నెల్లూరు నగరపాలకసంస్థలో 4.60లక్షల మంది ఓటర్లు ఉంటే రెండులక్షల మందికి పైగా ఈ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి తమ ఓటు ఏ డివిజన్‌లో వుంది, ఎక్కడ పోలింగ్‌బూత్‌లో వేయాలి అని తెలుసుకుని ఓట్లేసారు.

## అలర్ట్‌గా ఉండండి

### సిబ్బందికి కమీషనర్ ఆదేశం



నెల్లూరు నగరపాలకసంస్థ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి హాజరు కావాల్సిన ఎన్నికల విధుల ఉద్యోగులు 9వ తేదీ ఉదయం 6గంటలకల్లా డికెడబ్ల్యూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఉండాలని నగరపాలక సంస్థ కమీషనర్ జాన్ శ్యాంసన్ ఆదేశించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపును 9వ తేదీకి మార్చిన నేపథ్యంలో సిబ్బంది ఆరోజు విధులకు రావాలన్నారు. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజంట్లు కూడా 6గంటలకల్లా రావాలన్నారు.

## ఏటిఎంల వద్ద సందడి

ఎన్నికల సమయంలో నగదు లావాదేవీలపై పోలీసులు తీవ్రంగా నిఘా పెట్టారు. డివిజన్‌లలో ఓటర్లకు డబ్బులు పంచడానికి అభ్యర్థులు నానా తంటాలు పడ్డారు. బయట ప్రాంతాల నుండి వచ్చే వాహనాలను పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేసారు. దీంతో పలువురు అభ్యర్థులు తమ అకౌంట్లలో డబ్బు వేయించుకుని ఏటిఎంల ద్వారా డ్రా చేసుకున్నారు. అభ్యర్థులు ఏటిఎంల మీద పడడంతో సాధారణ ఏటిఎం కార్డుదారులు ఇబ్బందిపడ్డారు.

## ఆర్టీసీలో కొత్త ఫ్లాట్‌ఫారాలు

నెల్లూరులోని మెయిన్ ఆర్టీసీ బస్టాండ్‌లో కొత్త ఫ్లాట్‌ఫారాలను సిద్ధం చేస్తున్నారు. ఎన్‌ఎంయు కార్యాలయం పక్క మూడు ఫ్లాట్‌ఫారాలను నిర్మించారు. అలాగే తిరుపతి నాన్‌స్టాప్ బస్సులు ఆగే చోట మరో రెండు ఫ్లాట్‌ఫారాలను నిర్మించారు. ఇప్పటికే బస్టాండ్‌లో 23 ఫ్లాట్‌ఫారాలు ఉండగా, అదనంగా మరో 5 ఫ్లాట్‌ఫారాలు నిర్మించారు. అయితే బస్టాండ్‌లో ఇన్ని ఫ్లాట్‌ఫారాలున్నా రద్దీకి సరిపోవడం లేదు. నెల్లూరు గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే బస్సులు సైతం ఇక్కడ నుండే కదులుతుండడంతో దూరప్రాంతాలకు వెళ్ళే బస్సులకు ఒక్కోసారి ఫ్లాట్‌ఫారాలు దొరకడం లేదు. ఈ కొత్త ఫ్లాట్‌ఫారాలను దూరప్రాంతాలకు వెళ్ళే బస్సులకు కేటాయించనున్నారు.

## హోటళ్ళకు గిరాకీ

మార్చి 30వ తేదీ నెల్లూరులో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా హోటళ్ళకు గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా మాంసాహార హోటళ్లకు వ్యాపారం బాగా జరిగింది. అన్ని పార్టీలవాళ్లు పోలింగ్‌బూత్‌లలో ఏజంట్లకు, కార్యకర్తలకు బిర్యానీ ప్యాకెట్లు, పెరుగన్నం ప్యాకెట్లు భారీగా ఆర్డర్ చేసారు. ఎన్నికల పుణ్యమా అని హోటళ్లకు మంచి వ్యాపారం జరిగింది.

## జోరుగా బెట్టింగ్స్

నెల్లూరు నగరపాలకసంస్థ ఫలితాలపై నెల్లూరులో జోరుగా పందేలు సాగుతున్నాయి. నగరపాలకసంస్థలోని మొత్తం 54డివిజన్‌లలో ఏ పార్టీకి ఎన్ని వస్తాయనేదాని మీద ఎక్కువ పందేలు కాస్తున్నారు. అలాగే నగరంలో తీవ్రమైన పోటీ నెలకొన్న 4, 6, 7, 13, 20, 29, 50, 52డివిజన్‌ల గెలుపోటముల మీద కూడా భారీగా పందేలు కాసారు.

## చెమట్లు కక్కిస్తున్నారు

ఓ పక్క ఎండలు మండిపోతున్నాయి. మరోపక్క కరెంట్ కోతలు ప్రజలను ఊపిరాడకుండా చేస్తున్నాయి. నగరంలో ఉదయం 6గంటల నుండి 7.30గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుండి 4.30గంటల వరకు కరెంట్‌కోత ఉంటుంది. ఉదయం కోత సమయంలో పెద్దగా ఇబ్బంది లేదుగాని, మధ్యాహ్నం కోత సమయంలో మాత్రం జనం చెమటలు కక్కుతున్నారు.

## అద్దాల మందిరంలో అఖండ శ్రీ సాయినామ సంకీర్తన



నెల్లూరు పద్మావతినగర్‌లో శ్రీ సాయిదర్బార్(అద్దాల మందిరం)లో మార్చి 31 నుండి ఏప్రిల్ 7వరకు ఉగాది, శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా అనవరతం అఖండ శ్రీ సాయినామ సంకీర్తన మహాయజ్ఞం జరుగుతుంది. ఉగాదిరోజు వేకువజామున పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసినగర్‌ల మీదుగా సాయినామ నగరసంకీర్తన జరిగింది. తదుపరి మహాయజ్ఞానికి ప్రారంభ సూచికగా అఖండజ్యోతి ప్రజ్వలన జరిగింది. ఈ నెల 8న శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 5గంటలకు కాకడహారతి, 6గంటలకు సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, 9గంటలకు శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవం, 12గంటలకు మధ్యాహ్నహారతి, తదుపరి అన్నసంతర్పణ, సాయంత్రం 5గంటలకు సాయంసంధ్య హారతి, విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం, అనంతరం శిరిడి సంప్రదాయం ప్రకారం శ్రీ సాయినాథుని పూలరథం, వెండి పల్లకీ నగరోత్సవం, ముస్లిం గంధమహోత్సవం(ఉరుసు), జెండా ఉత్సవాలు జరుగుతాయి. మతసామరస్యం పరిఢవిల్లేలా సాగే ఈ మహోత్సవం భక్తిపూర్వకంగా, కన్నులపండువగా సాగుతుంది. దీనిని నిర్వహిస్తున్న సాయిదర్బార్ ట్రస్ట్, సత్సంగసేవాదళ్ సభ్యులకు 'లాయర్' ప్రత్యేక అభినందనలు.



నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికల ప్రచారంలో ఉండి హఠాత్తుగా గుండెపోటుకు గురైన 43వ డివిజన్ తెలుగుదేశం అభ్యర్థి షేక్‌మున్వర్‌బాషాను సింహపురి హాస్పిటల్స్‌లో పరామర్శిస్తున్న ఆ పార్టీ మేయర్ అభ్యర్థి డా॥ జడ్.శివప్రసాద్

### వేమిరెడ్డి దాతృత్వం

# ఇస్కాన్‌కు ప్రచారరథం




తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన నెల్లూరులోని 'ఇస్కాన్' దేవాలయానికి ప్రముఖ దాత, మానవతావాది వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రచార రథాన్ని కానుకగా సమర్పించారు. ఈ రథాన్ని హరినామ స్మరణతో ప్రసాదాలను, ఆధ్యాత్మిక గ్రంథాలను జిల్లా నలుమూలలా పంపిణీ చేయడానికి వినియోగిస్తామని ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రధానబాధ్యులు సుఖదేవ స్వామి తెలిపారు. ఉగాదిరోజు సాయంత్రం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వితరణతో దాదాపు 300 మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేయగా భజనలు, హారతులు, భగవద్గీత బోధనలు, శ్రీకృష్ణుని లీలలు తెలియజేసే నాటికలతో భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వంతో పరవశులయ్యారు.



మార్చి 28న నెల్లూరు టిటిడి కల్యాణ మండపంలో క్రాఫ్ట్‌బజార్‌ను ప్రారంభిస్తున్న హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కమీషనర్ రీజినల్ డైరెక్టర్ పి.మల్లికార్జునయ్య, జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ జనరల్ మేనేజర్ ఏ.సుధాకర్ తదితరులు

# ఈవిఎంలలో భవిష్యత్ భద్రం



## 9న ఫలితాల వెల్లడి

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అయితే ఈ నెల 2వ తేదీన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెల్లడించి ఉండాలి. అయితే మున్సిపల్ ఫలితాల వెల్లడిపై హైకోర్టులో పిటిషన్ వేయడం, హైకోర్టు ఈనెల9న ఫలితాలను వెల్లడించాలని చెప్పడం జరిగింది. ఆ రోజులోపు ఫలితాల వెల్లడిపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వకుంటే 9వతేదీ కౌంటింగ్ ఖాయం. ఈనెల 2వతేదీ కౌంటింగ్ ఉంటుందనే దిశగానే అధికారులు ఆయా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసారు. నెల్లూరు నగరపాలకసంస్థ లోని 54డివిజన్ల కౌంటింగ్ డికెడబ్ల్యూ కళాశాలలో జరుగనుంది.

కౌంటింగ్ 9వ తేదీ వరకు వాయిదా పడింది. కోర్టు తీర్పులతో పనిలేకుండా అధికారులు కౌంటింగ్ ఏర్పాట్లను పూర్తి చేసారు. 9వ తేదీ ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. కావలి, గూడూరు, ఆత్మకూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేటలలో కౌంటింగ్ తొందరగానే ముగిసే అవకాశ ముంది. నెల్లూరు నగరపాలక సంస్థలో డివిజన్‌లు ఎక్కువగా ఉన్నందున మధ్యాహ్నంపైన పూర్తి ఫలితాలు వెలువడవచ్చు. నెల్లూరులో అన్ని డివిజన్‌ల పోలింగ్‌ను ఒకేసారి చేపడుతారు. ప్రతి డివిజన్‌లోనూ ఓట్లను బట్టి 10 నుండి 12ఈవిఎంల దాకా ఉపయోగించారు. ప్రతి డివిజన్‌లోనూ మొదటి ఈవిఎం కౌంటింగ్ మొదటి రౌండ్‌గా, రెండో ఈవిఎం కౌంటింగ్‌ను రెండో రౌండ్‌గా పరిగణిస్తూ పోతారు. ఇలా ఏ డివిజన్‌లో ఎన్ని ఈవిఎంలుంటే అన్ని రౌండ్ల కౌంటింగ్ అని అర్థం. దీనివల్ల ఫలితాలు కూడా అటు ఇటుగా అన్ని డివిజన్‌లవి ఒకేసారి వెల్లడయ్యే అవకాశముంది. కావలిలో 40వార్డులకు, ఆత్మకూరులో 23వార్డులకు, సూళ్లూరుపేటలో 23వార్డులకుగాను 22వార్డులకు(1 ఏకగ్రీవం), వెంకటగిరిలో 25వార్డులకు, నాయుడుపేటలో 20వార్డులకుగాను 19వార్డులకు(1ఏకగ్రీవం) కౌంటింగ్ జరుగనుంది.

### కొత్తపాలకుల కోసం...

# కార్పొరేషన్ ఎదురుచూపు



**నెల్లూరు నగరపాలకసంస్థ దాదాపు మూడున్నర సంవత్సరాలుగా పాలకవర్గం కోసం ఎదురుచూస్తుంది. రేపు ఏర్పడబోయే కొత్త పాలకవర్గం కోసం కార్పొరేషన్ కార్యాలయం ముస్తాబవుతోంది.**

నెల్లూరు మున్సిపాల్టీ కార్పొరేషన్‌గా మారాక 2005లో తొలి కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్‌పార్టీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. మొదట పులిమి శైలజ, ఆ తర్వాత భానుశ్రీలు మేయర్‌లుగా వచ్చారు. 2010లో ఈ పాలకవర్గ కాలం పూర్తయ్యింది. అప్పటికే దివంగత మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి మరణించి ఉండడం, రోశయ్య ముఖ్యమంత్రిగా ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను నిర్వహించే సాహసం చేయలేకపోయింది. మున్సిపాల్టీలకు ప్రత్యేక అధికారులను పెట్టి బండిని లాగించారు. రోశయ్య తర్వాత సీఎంగా వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ఎన్నికల జోలికి వెళ్లలేకపోయారు. ప్రత్యేకాధికారులతోనే ఆయనా నెట్టుకొచ్చారు.

అయితే సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్రం సిద్ధమైన నేపథ్యంలో న్యాయస్థానం అక్షింతలు వేయడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలను పెట్టాల్సి వచ్చింది. ఎట్టకేలకు మున్సిపల్ ఎన్నికలు జరిగిపోయాయి. కొత్త పాలకవర్గాన్ని ఏ పార్టీ ఏర్పాటు చేస్తుంది, కొత్త మేయర్‌గా ఎవరొస్తారనేది ఈ నెల 9వ తేదీన కౌంటింగ్ జరిపితే వెల్లడవుతుంది. కొత్త పాలకవర్గం వచ్చేవరకు కార్పొరేషన్‌లో స్తబ్ధత తప్పదు.

# సంతోషంగా 'శ్రీ జయ' ఉగాది సంబరాలు




నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో మార్చి 31న జిల్లా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శ్రీ జయ నామ సంవత్సర ఉగాది సంబరాలు సంతోషంగా జరిగాయి. ఈ సంబరాలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ అందరూ ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధించాలని, ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకొని మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టరు రేఖారాణి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీ గురుకృపా కళాక్షేత్రం చిన్నారులు స్వాగత నృత్య ప్రదర్శన, గోమతి స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం, కూచిపూడి నృత్యం, కావలికి చెందిన శ్రీ విఘ్నేశ్వర కళానిలయ విద్యార్థులు జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత మాచవోలు భాస్కర్‌శాస్త్రి, పంచాంగ శ్రవణం చేయగా అనంతరం పాతూరి అన్నపూర్ణ నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో నెల్లూరు ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, చీమకుర్తి వెంకటేశ్వరరావు, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, గుర్రాల రమణయ్య, జి.సుభద్రాదేవి, మోపూరు పెంచల నరసింహం, గాలి లలితా ప్రవల్లికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు నెల్లూరుజిల్లాకు చెందిన తమన్ పాల్గొని మాట్లాడుతూ రెండువారాల్లో నెల్లూరులో పెద్దమ్యూజికల్ ఈవెంట్ చేస్తానని, దాని ద్వారా వచ్చిన నిధిని శ్రీ వేంకటేశ్వర కస్తూర్బాకళాక్షేత్రం అభివృద్ధికి వినియోగిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్టసేవలందించిన ప్రముఖులు డాక్టర్ చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయుడు వై.శ్రీనివాసరావు, కార్టూనిస్టు డి.వి.ఎస్.ప్రసాద్, సంగీతంలో పోలాటిరాజు, కూచిపూడి నృత్యంలో డేగా సాంబ శివరావు, సినీ సంగీత దర్శకులు తమన్‌లను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్, జిల్లా జడ్జి దుర్గారావు, ఏజేసీ రాజ్‌కుమార్, ట్రైనీ జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, డి.ఆర్.డి.ఏ పిడి చంద్రమౌళి, జడ్పీ సిఇఓ జితేంద్ర, డిఎస్‌ఓ శాంతకుమారి, ఐసీడీఎస్ పిడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ షిర్డి సాయిబాబా జన్మదిన, శ్రీరామనవమి ఉత్సవములు

**08-4-2014 మంగళవారము నుండి 10-4-2014 గురువారము వరకు**

పై దినములలో ప్రతిరోజు
ఉదయం 7 గం॥ల నుండి బాబా వారికి
మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు
12 గంటల నుండి
సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు
జరుగును.

- పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/-లు చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది.
- పైరోజులలో ప్రతిరోజు నాలుగుపూటలా షిరిడీ హారతులు జరుగును.
- ప్రతిరోజు సాయంకాలం 7గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

భక్తులు తమకు తోచిన విధముగా ధనరూపములోగాని, ద్రవ్యరూపములోగాని మందిర గుమస్తా వద్ద చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది. పై కార్యక్రమములలో భక్తులందరూ పాల్గొని బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి, వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

ఇట్లు: కార్యవర్గము

**శ్రీ షిర్డి సాయిబాబా మందిరము**
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

శ్రీను గల్పిక

# నెల్లూరు వీధుల్లో బాపూజీ

అది ఇంద్రలోకం. దేవేంద్రుడు సింహాసనంపై కూర్చుని టీవీలో వస్తున్న 'సందులో లీల – గుండెల్లో మన్మధగోల' సినిమా చూస్తున్నాడు. అప్పుడే అక్కడకు మహాత్మాగాంధీజీ వచ్చాడు. ఆయనను చూడగానే దేవేంద్రుడు టీవీని కట్ చేసి... ఏం బాపూజీ ఇలా వచ్చారు. మీకేమన్నా అసౌకర్యం కల్పించామా... మీపట్ల ఏదన్నా అపరాధం జరిగిందా? అని అడిగాడు. గాంధీజీ అందుకు... లేదు దేవేంద్ర, ఇక్కడ బాగానే చూసుకుంటున్నారు, కాకపోతే నాకు భూలోకం మీదకు మనసుమళ్లింది. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయంట, భారతదేశంలో గ్రామస్వరాజ్యం కోసం కలలుకన్నవాడిని, నా దేశం ఎలా వుందో, నా ప్రజలు ఎంత చైతన్యవంతంగా ప్రజాస్వామ్య వ్యవస్థను నడిపిస్తున్నారో చూడాలని వుంది, అందుకే భూలోకానికి వెళ్లడానికి రెండు రోజులు సెలవు కావాలన్నాడు. దానికి దేవేంద్రుడు... మహాత్మా, మీ మంచికోరి చెబుతున్నాను, ఇప్పుడు భూలోకానికి వెళ్లొద్దు... ఆ కాలంలో కాబట్టి మీరు హత్యకు గురయ్యారు, ఇప్పుడున్న పరిస్థితులను చూస్తే మీ పాటికి మీరే ఆత్మహత్య చేసుకుంటారు. నా మాట విని ఇక్కడే ఉండండన్నాడు. అందుకు గాంధీ ఒప్పుకోలేదు. ఎలాగైనా వెళ్లి తీరాల్సిందేనని పట్టు బట్టాడు. దేవేంద్రుడు ఇక చేసేదేమీ లేక భూలోక యాత్రకు అనుమతి మంజూరు చేస్తూ-కేవలం నెల్లూరులో మాత్రమే పర్యటించాలని షరతు విధించారు. గాంధీజీ అందుకు ఒప్పుకున్నాడు. గాంధీజీ లగేజీ సర్దుకుని బయల్దేరుతుండగా దేవేంద్రుడు, ఆయనకు టెన్నిస్‌బ్యాట్‌లాంటి వస్తువునిచ్చాడు. అది చూసి బాపూజీ, నేనేం టెన్నిస్ ఆడుకోవడానికి భూలోకానికి పోవడంలేదు. ఎన్నికలు ఎలా జరుగుతున్నాయో చూద్దామని వెళుతున్నానన్నాడు. అందుకు దేవేంద్రుడు... ఇది టెన్నిస్‌బ్యాట్ కాదు, నెల్లూరు నగరం ఐఆర్420 దోమలకు ప్రసిద్ధిగాంచింది, ఆ దోమల నుండి నిన్ను నువ్వు కాపాడుకోవడానికే ఈ సాంకేతిక పరికరం అని చెప్పాడు. దేవేంద్రుడి వద్ద సెలవు తీసుకుని గాంధీజీ బయలు దేరాడు.

★★★★★

గాంధీజీ నేరుగా వేదాయపాలెంలో దిగాడు. ఎన్నికల సరళి ఎలా వుందో చూద్దామని ఓ కాలనీలోకి వెళ్లాడు. ఆయన ఓ వీధిలో నడిచిపోతుండగా... అక్కడున్న ఇళ్లల్లోవారు గాంధీని పిలుస్తూ... మా ఇంటికి ఇంకా రాలేదు, మా ఇంట్లో నాలుగు ఓట్లున్నాయి, మా ఇంట్లో ఆరు ఓట్లున్నాయని అంటున్నారు. వీళ్ల ఇళ్లలోకి ఎందుకు పిలుస్తున్నారబ్బా అనుకుని ఒక ఇంట్లోకి వెళ్లాడు. ఆ ఇంట్లో వున్న వ్యక్తి గాంధీజీ చేతిలో నాలుగు స్లిప్పులు పెట్టి, మొత్తం నాలుగు ఓట్లు పెద్దాయన... నాలుగు వేలివ్వండి అని అడిగాడు. గాంధీజీకి ఏమీ అర్థంకాలేదు. నాలుగు ఓట్లేంటి, నాలుగువేలేంటి అని అడిగాడు. అందుకు అతను... ఇప్పుడే ఒక పార్టీ వాళ్లొచ్చి ఓట్లకు డబ్బులిచ్చి వెళ్లారు. వెంటనే మీరొస్తే రెండో పార్టీ వాళ్లనుకున్నాం... మీరు ఓట్లు కొనడానికి రాలేదా అని ఆ వ్యక్తి అడిగాడు. ఓట్లేంటి, కొనడం ఏంటి... అసలేం జరుగుతుందని గాంధీజీ అడిగాడు. అందుకు ఆ వ్యక్తి... నువ్వు ఏ దేశం నుండి వచ్చావు పెద్దాయన, ఓట్ల కొనుగోలు గురించే తెలియనట్లు మాట్లాడుతున్నారన్నాడు. నిజంగా నాకు ఓట్లు కొనుగోలు విషయం తెలియదని గాంధీజీ చెప్పాడు. అప్పుడా వ్యక్తి... మీ అమాయకత్వాన్ని చూస్తుంటే నాకు జాలేస్తుంది, నువ్వు తొందరపడి ఎవరికన్నా ఫ్రీగా ఓటేస్తావేమో, అలా చేయొద్దు. ప్రతి డివిజన్‌లోనూ పోటీలో నాలుగేసి పార్టీలున్నాయి. ఒక్కో అభ్యర్థి ఓటుకు వెయ్యిస్తాడు, నువ్వు ఓటర్ స్లిప్పును నాలుగింటిని జెరాక్స్ తీసిపెట్టుకో, నాలుగు పార్టీల వాళ్లకు స్లిప్పులివ్వు... నాలుగు వేలు వస్తాయన్నాడు. డబ్బు తీసుకుని ఓట్లేయడం తప్పు కదా నాయనా అని గాంధీజీ అన్నాడు. అందుకు అవతలి వ్యక్తి... అబ్బా పెద్ద దిగొచ్చాడండి అన్నా హజారే, డబ్బులు తీసుకోకుండా ఓట్లేసే గాంధీకాలం ఎప్పుడో పోయింది పెద్దాయన... ఇంకా ఆ కాలంలో ఉంటే కుదరదు. నాయకులు దేశాన్ని దోచుకుంటున్నప్పుడు మనం వాళ్లను దోచుకోవడంలో తప్పేముంది పెద్దాయన అని అడిగాడు. గాంధీజీకి అక్కడ సన్నివేశాలతో తీవ్ర మనస్థాపం కలిగింది. నా దేశమేంటి ఇలా తయారైందనే బాధతో అక్కడనుండి బయటకు వచ్చాడు. ఆయన అలా వీధిలోకి రాగానే మొదట ఒక పార్టీ వాళ్లొచ్చి చేతిలో వెయ్యి రూపాయలను బలవంతంగా పెట్టి నీ ఓటు ఈ గుర్తుకే వేయమంటూ చేతిలో నమూనా బ్యాలెట్ పెట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత మరో రెండు పార్టీల వాళ్లు కూడా అంతే వేగంగా వచ్చి ఆయన చేతిలో డబ్బులు, నమూనా బ్యాలెట్ పేపర్లు పెట్టి వెళ్లిపోయారు. ఆ పరిణామాలతో అవాక్కయిన బాపూజీ అక్కడనుండి పొదలకూరురోడ్డులోని ఓ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడున్న ఓ వ్యక్తిని పిలిచి... ఈ సెంటర్‌ను ఏమని పిలుస్తారని అడిగాడు. సారాయి అంగడి సెంటర్ అంటారని అతను చెప్పాడు. ఎక్కడన్నా మహనీయుల పేర్లు ఊర్లకు, ప్రాంతాలకు పెడతారు, ఇలా సారాయి, బ్రాందీ, విస్కీల పేర్లు కూడా ప్రాంతాలకు పెడతారా అని ఆశ్చర్యపోయాడు. అంతలో ఒక పార్టీ నాయకులొచ్చి... పెద్దాయన, ఇప్పుడు మా పార్టీ ర్యాలీ వుంది, మనిషికి 200రూపాయలు, క్వార్టర్ సీసా, బిర్యానీ ప్యాకెట్టు ఇస్తామన్నాడు. అది విని బాపూజీ నోరెళ్లబెట్టి, ర్యాలీలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తారు కదా, పార్టీ మీద అభిమానముండేవాళ్లు వచ్చి ర్యాలీలలో పాల్గొంటారు కదా అని అడిగాడు. దానికా వ్యక్తి... అవంతా సత్తికాలం మాటలు పెద్దాయన... ఇప్పుడు నా ఇంట్లో వాళ్లయినా సరే వచ్చి ర్యాలీలో పాల్గొనాలంటే డబ్బులివ్వాల్సిందే. లోకం మారింది పెద్దాయన అని ఆ వ్యక్తి చెప్పాడు.

ఎన్నికలు ఇంత ఘోరంగా తయారయ్యాయా అని బాధపడుతూ ఆకలిగా వుండడంతో బాపూజీ మద్రాసుబస్టాండ్ సెంటర్‌లోని ఒక హోటల్‌కు వెళ్లాడు. పంచె గుడ్డలో పెట్టుకున్న డబ్బుల్లో ఒక పావలా తీసి క్యాష్ కౌంటర్‌లో వున్న వ్యక్తికి ఇస్తూ నాయనా, ఒక శాఖాహార భోజనం టిక్కెట్టు ఇవ్వు అని అడిగాడు. ఆ వ్యక్తి బాపూజీని ఎగాదిగా చూస్తూ... మీరు ఏ కాలంలో వున్నారు పెద్దాయన, ఈ పావలాలు ఇప్పుడు చెలామణిలోనే లేవు. భోజనం 60రూపాయలని చెప్పాడు. గాంధీజీ అక్కడ భోజనం చేసేసి ఏ.సి సెంటర్‌కు చేరుకున్నాడు. అక్కడ సెంటర్‌లో స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కళ్లకు నల్లద్దాలు పెట్టుకుని ఓ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. గాంధీజీ ఆయన వద్దకెళ్లి... ఏం నాయనా ఖాళీగా వున్నావు... ఈ జిల్లాలో నువ్వు పేరుమోసిన రాజకీయనాయకుడివని విన్నాను, నగరంలో ఇంత ఎన్నికల హడావిడి వుంటే నువ్వింత ప్రశాంతంగా వున్నావేంటని అడిగాడు. దానికి వివేకా... అంతా ఆ మహాతల్లి సోనియాగాంధీ పుణ్యమే. సాధారణంగా ఎన్నికలొచ్చాయంటే నాకు వేరుశెనక్కాయలు తినే తీరిక కూడా దొరకదు. కాని రాష్ట్ర విభజనతో సోనియా తల్లి నాకు ఎన్నికల పని లేకుండా చేసిందని చెప్పాడు. గాంధీ వుండి... నాయనా నగరమంతా తిరిగాను, ఎక్కడ చూసినా ఓట్లు, డబ్బులు, మద్యమే కనిపిస్తున్నాయి, అసలు గాంధీయిజాన్ని ఎవరూ అనుసరించడం లేదా అని అడిగాడు.

అందుకు వివేకా... గాంధీయిజమా పాడా పెద్దాయన... ఇప్పుడు మోడీయిజం, పవనిజం, లాడెనిజం, ముఫైత్‌ఖానిజం వంటివే పని చేస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు దాడిచేసే టైమొచ్చింది. మీరు వెంటనే ఇంటికి వెళ్లండి. లేకుంటే ఆస్పత్రికి వెళ్లాల్సి వుంటుందన్నాడు.

అప్పుడు అర్థమైంది గాంధీజీకి... దేవేంద్రుడు తనను భూలోకం ఎందుకు వెళ్లొద్దన్నాడో. నెల్లూరులో చూసిన దృశ్యాలను తలచుకుని చింతిస్తూ... గాంధీజీ స్వర్గలోకానికి తిరుగుపయనమయ్యాడు.

★★★★★

## కదంబం

## ప్రస్థానం

**ముకుంద రామారావు,**
**హైదరాబాద్, 99083 47273.**

సమయం సాక్షిగా
ఆ రాసిన అక్షరాలు
ఏ ఏకాంత క్షణంలో
ఎవరు రాసినవో

ఎంత అపురూపంగా
దాచుకున్నారో
ఈ నేల రాలిన వాక్యాలు

మట్టిలో కలిసిపోకుండా
ఈ వాడిపోని వాక్యాలు
ఎన్నెన్ని గాలుల్ని తట్టుకున్నాయో
అంతులేని సహనంతో
ఎవరు చూస్తారో
ఎంత ఆదరిస్తారోనని

ఇప్పుడిలా నా కంటపడకముందు
ఎందర్ని చూసాయో
ఇక ముందు
అవీ నేను
ఎవరి ప్రస్థానం ఎటో

## ఉత్తమ కవిత "రక్తం చిందిన రాత్రి"



సత్కారాన్నందుకుంటున్న కె.వి.నాగేశ్వరరావు

చిత్తూరుజిల్లా పలమనేరు 'తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి' ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో నెల్లూరు జిల్లాకు చెందిన కవి, రచయిత కె.వి.నాగేశ్వరరావు రచించిన "రక్తం చిందిన రాత్రి" కవితకు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ఇటీవల పలమనేరు మధు డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కంకణాల రత్నయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి నాగేశ్వరరావును నగదు, జ్ఞాపిక, యోగ్యతాపత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సభలో మధు కాలేజీ ప్రిన్సిపాల్ డా॥ రాజేంద్రరెడ్డి, తెలుగు భాషాసంఘం సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొని జయప్రదం చేసారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ అధిపతి డా॥ బూదాటి వెంకటేశ్వర్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ ఏడాది వరుసగా 4కవితా అవార్డులు వివిధ సంస్థల నుండి కె.వి.నాగేశ్వరరావుకు లభించడం మనందరికీ గర్వకారణం.

## తెలుగు విరబూసిన సృజన వక్తృత్వ, పాటల పోటీలు






ప్రసంగిస్తున్న టి.మమతారెడ్డి

నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని గ్రంథాలయం మిద్దెపైన మార్చి 31న ఉగాది పండుగ సందర్భంగా సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో వక్తృత్వ, పాటల పోటీలు జరిగాయి. వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నవారు ఆంగ్ల పదాలు దొర్లకుండా తెలుగులోనే ప్రసంగించాలన్న నిబంధనతో అచ్చమైన తెలుగు పదాల కోసం మెచ్చుకోదగ్గ ప్రయత్నం చేసారు. తెలుగు భాష, సంస్కృతుల ప్రాముఖ్యతను చాటే పాటల పోటీలో పాల్గొన్న ఔత్సాహిక గాయకులు అందరినీ తమ గానాలతో అలరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి టి.మమతారెడ్డి, ఆచార్య ఆదిత్య, చలనచిత్ర పంపిణీదారులు చేజర్ల సీతారామిరెడ్డి, సెవెన్‌లెటర్స్ ఆర్కెస్ట్రా అధినేత ఎస్.సుధాకర్, ఉత్తమ ఉపాధ్యాయులు షేక్ చాంద్‌బాషా, ఇంజనీర్ సీతారామస్వామి, సృజన సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ, న్యాయనిర్ణేతలు నాట్యాచార్య ఎన్.వి.రమణయ్య, కవి పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ, ఎస్.శోభాదేవి, ఏ.దశయ్య, సర్వేపల్లి రామ్మూర్తి, టి.ఏ.పద్మనాభరావు, రాయప్రోలు శ్రీరామకృష్ణ, జి.బాబూరావు, పట్టెం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థలనటులు చెముడూరు శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులందించారు.

## శ్రీ నేతాజీలో ఘనంగా ఉగాది సంబరాలు



విజయనామసంవత్సరము పూర్తిచేసుకొని జయనామ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని మార్చి 29న తెలుగు నూతన సంవత్సర ఆరంభ వేడుకలు నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలులో కరస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షడ్రుచులైన తీపి, పులుపు, చేదు, వగరు, కారం, ఉప్పుల ప్రతీకలైన బెల్లం, మామిడి, చింతపండు, ఉసిరి, వేపపూత, ఉప్పు, మిరియాల పొడులతో మిళితమైన ప్రత్యేకఆకర్షణ ఉగాది పచ్చడని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, కథలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంప్రదాయ విలువలను పంచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల విద్యార్థులకు చక్కటి అవగాహన కలుగుతుందని తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి హెడ్మాస్టర్ వి.సుధాకరరావు, హెడ్‌మిస్ట్రస్‌లు ప్రసన్న, డి.వాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయడం మంచిది. కుటుంబసభ్యుల మధ్యగల సమస్యలను సమన్వయ బుద్ధితో పరిష్కరించుకొనండి. దూరప్రయాణాలుంటాయి. ఆత్మీయులను బంధువులను కలుసుకొంటారు. ఈ రాశి వారికి ఆర్థికంగా పెద్ద ఇబ్బందులు లేకుండినా అసంతృప్తి ఉంటుంది. ఖర్చులు అదనంగా ఉండి, దాచుకున్నది ఖర్చు చేయడమో, ఋణం చేయడమో ఉంటుంది.


## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు పని సామర్థ్యం, అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబసభ్యులతో అనుకూలత సరిగా ఉండదు. ఉద్యోగ ప్రయత్నాలలో కొత్త ఆఫర్లుంటాయి. హడావుడి పనులు జరపడం, మాటలు చెప్పడం చేయవద్దు. ఆర్థికంగా బాగుంటుంది. ముందు మీరు ప్రవేశపెట్టిన ప్రణాళిక ఆలోచనలు కార్యరూపం దాల్చి ఆర్థిక స్థితిని వృద్ధి పరుస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. కోర్టు వ్యవహారాలు, స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదాపడగలవు. క్రొత్త కాంట్రాక్టులు, కొత్త పెట్టుబడులు లభించే అవకాశమున్నది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగిపోగలవు. ఆదాయముతో సమానంగా ఖర్చులు పెరుగగలవు. అనుకున్న పనులు వాయిదా పడవచ్చు లేక ఆలస్యంగా జరగవచ్చును.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు. సభలు సమావేశాలలో పాల్గొంటారు. క్రొత్త బాధ్యతలు, సభ్యత్వాలు చేపట్టవలసి ఉంటుంది. సొంత పనులు, అనుకున్న కార్యక్రమాలు సరిగాసాగవు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు. ఆడంబరాలకు, పొగడ్తలకు పోయి ఖర్చులు పెంచుకుంటారు. ఆర్థికాభివృద్ధి అవకాశాలు ఈవారంలో సరిగా ఉండవు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 04.04.2014 నుండి తేది. 10.04.2014 వరకు

ఈ వారము మేషంలో కేతువు, వృషభమిథున కర్కాటక సింహరాశులలో చంద్రుడు, మిథునంలో గురువు, కన్యలో వక్ర కుడ, తులలో శనిరాహువులు, కుంభంలో శుక్రుడు, మీనంలో రవిబుధులు సంచరిస్తారు.

**పంచాంగము:** తేది 8 మంగళవారము శ్రీరామనవమి

**ముహుర్తము:** తేది 9 బుధవారము ఉదయము 9.40నుండి 11.48లోగా పుష్య నక్షత్ర మిథునలగ్నము వ్యాపార ఉపనయన అక్షరభాస్య, గృహారంభము.

**చైత్ర మాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | శుక్ర | పంచమి | రా॥గం10.35వ॥ |
| తేది. 05 | శని | షష్ఠి | రా॥గం11.41వ॥ |
| తేది. 06 | ఆది | సప్తమి | రా॥గం.1.12వ॥ |
| తేది. 07 | సోమ | అష్టమి | రా॥గం.3.05వ॥ |
| తేది. 08 | మంగళ | నవమి | రా॥గం.5.04వ॥ |
| తేది. 09 | బుధ | దశమి | పూర్తిగా |
| తేది. 10 | గురు | దశమి | ఉ॥గం.7.10వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. పలుకుబడి బాగుండి, విమర్శించిన వాళ్ళే దగ్గరికి చేరతారు. మాట, డబ్బుతో ఇతరులకు సహాయపడతారు. ఉద్యోగార్థులకు మంచి అవకాశాలు దొరకగలవు. ఉద్యోగులకు అధికారుల అండదండలు సామర్థ్యం బాగుంటుంది. షేర్లు పెట్టుబడులందు లాభాలుంటాయి. రాజకీయ వర్గాలకు అవకాశాలు పలుకుబడి బాగుంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తులు పెట్టుబడులపై ఆదాయము బాగుంటుంది. పట్టువిడుపు ధోరణితో సమస్యలను పరిష్కరించుకోవాలి. సభలు, కమిటీలలో మీ సూచనలు సలహాలు ఆమోదం పొందుతాయి. ఆర్థికంగా ఇబ్బందులనెదుర్కొనవలసి ఉంటుంది. అయినా ఆదాయానికి లోపం రాదు. వృత్తి వ్యాపారాల నిర్వహణ ఆదాయాలలో ఆశించినంత ఫలితం ఉండదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

రాజకీయ పలుకుబడి కోరే వారు మరింత ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. బంధువర్గ సభ్యుల అనారోగ్య వార్తలు తెలుస్తాయి. కొత్త పెట్టుబడులు పొదుపు పథకాలు లాభాలనిస్తాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తి, ప్రయోజనకరంగా ఉంటాయి. బిడ్డల వల్ల చిన్న చిన్న సమస్యలుండి సర్దుబాటుకాగలవు. శుభకార్య ప్రయత్నాలు నెరవేరగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిర్ణయంకాగలవు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తుల నిర్ణయాల మీద ఆచితూచి వ్యవహరించండి. ప్రభుత్వ అనుమతులు, ఋణాల విషయంలో ఆలస్యం జరుగుతుంది. సోదరవర్గ కుటుంబాలకు మంచి జరుగుతుంది. వస్త్రాభరణ, ఫలసరుకుల, నిర్మాణ వస్తువుల వ్యాపారాలకు ఆదాయం పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధి ఉంటుంది. మిగిలిన వ్యాపారులు, వాణిజ్య ఏజన్సీలకు సామాన్యంగా రాబడి ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వాహన రిపేర్లు వస్తు రిపేర్లుండగలవు. వాహనాలు యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. గాయాలు తగలవచ్చును. వృత్తి వ్యాపారాల మీద శ్రద్ధ దృష్టిపెట్టండి. పనులు సక్రమంగా జరుగుతున్నా మానసికాందోళన ఎక్కువగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి మంచి అవకాశాలు దొరకకపోవచ్చును. సొంత వ్యవహారాలలో ఇతరుల ప్రమేయం రానీయకండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు, నూతన వ్యాపార ఆలోచనలు కలుగుతాయి. ఈ వారం ఆదాయానికి ఇంచుమించు సమానంగా ఖర్చులుంటాయి. కోర్టు వ్యవహారాలు, ప్రయాణాలు వాయిదా పడగలవు. ఆహారం, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. శాస్త్ర సాంకేతిక రంగాల ఉద్యోగులకు శ్రమ పనిభారం పెరుగుతుంది. ఇంటా బయట వ్యవహారాలను ఓర్పు ఓపికతో నడపండి. పెండింగ్‌లో గల పనులు మరలా కొనసాగుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇంట కుటుంబవ్యక్తులకు అనారోగ్య బాధలుండగలవు. ఉద్యోగులకు సమర్థతతో పాటు అధికారుల ఆదరణ బాగుండును. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగినా ముందుకు కొనసాగుతారు. అయితే టెన్షన్‌గా ఉంటుంది. అనవసర ఖర్చులు కొద్ది ఎక్కువగానే ఉంటాయి. వృత్తి వ్యాపార రంగాలలో ప్రోత్సాహము, ఆదాయం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

దైవ, సేవాకార్యాలలో, సభలు సమావేశాలలో పాల్గొంటారు. స్థిరాస్తుల లావాదేవీలకు వనరులు సమకూర్చుకొంటారు. కుటుంబసభ్యుల ఇబ్బందులను అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధికి మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. శాస్త్ర సాంకేతిక కళా క్రీడారంగాల వారు మంచి ప్రతిభను కనపరచడం, గుర్తింపు పొందడం జరుగుతుంది.

# శ్రీకాళహస్తిలో వైభవంగా ఉగాది



దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఉగాది సంబరాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఆలయాలలో ఆలయంలోకి ప్రవేశించే అన్ని గోపురాల వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. జయనామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అర్చకులు పూజలు నిర్వహించారు. రెండోకాలాభిషేకం తర్వాత స్వామి వారి ధ్వజస్తంభం వద్ద సోమస్కందమూర్తిని సింహాసనంపై, అమ్మవారిని చప్పరంపైన కూర్చోబెట్టి పంచామృతాభిషేకం చేశారు. ఉగాది పండుగ సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి, ఇఇ రామిరెడ్డి, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ శాంతారాం జె.పవార్, సూపరింటెండెంట్ హరిబాబుయాదవ్, పి.ఆర్.ఓ. సుదర్శన్, ఏ.పి.ఆర్.ఓ. సాయి, మణి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పెండ్లిమండపం వద్ద వెలసి ఉన్న సంకల్ప సిద్ది వినాయక ఆలయంలో ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఆకర్షించే విధంగా గోపురం ఆకారంలో వినాయకునికి పెట్టి అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. ఈ కార్యక్రమం తన్నీరు రామ్మోహన్‌రావు, తన్నీరు బ్రదర్స్ నిర్వహించారు.


# సర్కార్ వైద్యంలో నాణ్యత పెరగాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎం.రవిచంద్ర

సర్కార్ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ యం.డి ఎం.రవిచంద్ర పేర్కొన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న ఆయన 1వ తేదీ పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేస్తే ప్రభుత్వవైద్యంపై విశ్వాసం కలుగుతుందన్నారు. హెచ్‌డిఏఫ్ నిధులను సక్రమంగా వినియోగించాలని, నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఈవిఎంలలో ఏముందో?



చిత్తూరు జిల్లాలో పుర పోరు ఆదివారంతో ముగిసింది. పోలింగ్ తరువాత అభ్యర్థుల భవిత ఈవిఎంలోకి వెళ్ళింది. 8వ వార్డులో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, 18వ వార్డులో ట్రస్టుబోర్డుమాజీ చైర్మన్ శాంతారాం జె.పవార్, 13వ వార్డులో కోలా ఆనంద్,అలాగే చైర్మన్ అభ్యర్థులు కాంగ్రెస్ లక్ష్మమనేని మధు, 5వ వార్డులో టిడిపి పేట రాధారెడ్డి, 6వ వార్డులో వైసిపి మిద్దెలహరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫలితాల కోసం అభ్యర్థులు రాజకీయ పార్టీల నేతలు టెన్షన్‌తో నిరీక్షిస్తున్నారు. అక్కడక్కడ చిన్న పొరబాట్లు జరిగినా పోలీసు అధికారులు అప్పటికప్పుడు వచ్చి సర్ది చెప్పారు. ఈ పురపోరులో ఏ పార్టీకి చైర్మన్ పదవి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. పుర ఫలితాల ప్రకటనపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఏమిటోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఈటిసి కేంద్రంలో ఉన్న స్ట్రాంగ్‌రూంలో ఈవిఎంలో భద్రపరచారు. పురపాలక సంఘంలో 35 వార్డుల్లో 152 మంది అభ్యర్ల ఎన్నికల బరిలో ఉన్నారు. 57,139 మంది ఓటర్లు ఉండగా అందులో 42,089 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక పార్టీల విషయానికొస్తే ఎవరి ధీమాలో వారు ఉన్నారు. అయితే అభ్యర్థులు విజయం తమదేనని పైకి చెబుతున్నా లోలోన మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఓటర్లు అన్ని పార్టీల వారి దగ్గర నుంచి సొమ్ము తీసుకున్నారు. కానీ, వారు ఎవరికి నిర్ణయించుకున్నారో వారికి మాత్రమే ఓటు వేశారు. ఇంతకు ముందు జరిగిన ఎన్నికల కన్నా ఈ సారి ఎన్నికల వేడి ఎక్కువైంది. ఓటర్లు ఎవరూ పార్టీలను చూసి ఓటు వేయడం లేదని వ్యక్తిని బట్టి ఓటు వేశామని ఖచ్చితంగా చెప్తున్నారు. అభ్యర్థులు ఓటర్లకు బాగానే నజరానాలు పంచి పెట్టారు. ఓటర్లు ఎవరిని గెలిపిస్తారో వేచి చూడాల్సిందే,

**చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పోలైన ఓటర్ల శాతం**

శ్రీకాళహస్తి: 73.66 శాతం, చిత్తూరు : 71,17 శాతం, పలమనేరు: 75 శాతం, పుంగనూరు: 75.94 శాతం, మదనపల్లె : 58.99 శాతం, పుత్తూరు: 83.5 శాతం, నగరి : 88 శాతం ఓట్లు పోలయ్యాయి.

# ముస్లిం యూత్ ఉగాది సంబరం



నెల్లూరు ముస్లీం యూత్ ఆధ్వర్యంలో ఉగాది తెలుగు సంవత్సరమును పురస్కరించుకొని కోటమిట్ట, మెక్లిన్స్ రోడ్డులో నివాసముంటున్న పేదలకు బియ్యం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నెల్లూరు ముస్లీంయూత్ అధ్యక్షుడు ఖలీద్ మాట్లాడుతూ మనకు ఉన్నంతలో పేదలకు సహాయం చేస్తే ఆ మంచితనము మనం చనిపోయిన తరువాత కూడా బ్రతికుంటుందని అన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేసారు.

కార్యక్రమంలో ఎ.ఎమ్.సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల డా॥అస్లాం, సూక్ష్మ కళాకారుడు ముస్సవీర్, క్యాటరింగ్ ఇస్సాక్, జియావుల్‌హక్, అల్తాఫ్, కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్నా, అజ్మల్‌ఖాన్, అస్లాంఖాన్, గయాజ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా త్యాగరాజ స్మరణోత్సవాలు




2014 మార్చి 21 నుండి 27వతేదీ వరకు నెల్లూరు టౌన్‌హాల్‌లో శ్రీ త్యాగరాజస్మరణోత్సవాలు వైభవంగా జరిగాయి. గత 49సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండ జరుగుతున్న త్యాగరాజ స్మరణోత్సవాలను ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరిగేందుకు మూడు నెలల ముందు నుండి నెల్లూరు నగరంలోని ప్రతి వీధిలో ఉత్సవాల గురించి ప్రచారం చేస్తూ భిక్షాటన చేసి, తద్వారా లభించే నగదు ద్వారా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కీర్తిశేషులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, డాక్టర్ యనమండ్ర వెంకటేశ్వర శాస్త్రిలు ఈ ఉత్సవాలకు మూలపురుషులు. నాటి నుండి జరుగుతున్న ఉత్సవాలలో స్థానిక కళాకారులకు ప్రాధాన్యత ఇస్తు వారిని ప్రోత్సహించడంతో పాటు జాతీయ స్థాయిలోని ప్రముఖ సంగీత విద్వాంసులను పిలిపించి కచ్చేరి జరిపించడం ఈ సభల యొక్క ముఖ్య ఉద్ధేశ్యం. నేటి వరకు అదే ఆశయాలతో సభలను నిర్వహిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం జరిగిన ఉత్సవాలలో 21వతేది జె.వి.యస్.ఆర్ ప్రసాద్, 22న చెన్నైకి చెందిన దినేష్ కుమార్ అండ్ పార్టీ, 23వతేదీ చెన్నైకి చెందిన సిక్కిల్‌గురుచరణ్, 24న సాతూరు సిస్టర్స్, 25న అమృతమురళీ అండ్ పార్టీ, 26న తేవూరు, 27న బి.సాయిరామ్ అండ్ పార్టీ వారి గాత్ర కచేరీలు సింహపురి ప్రజలకు వీనులవిందు చేశాయి. అలాగే నగరానికి చెందిన శ్రీమతి ఎస్.పి.శైలజ, వసంత, శ్రీమతి దేవసేన, శ్రీమతి జె.బాలార్క, డి.వి.సురేష్‌రావు, ఎ.లక్ష్మీప్రసన్న, రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి, హేమలక్ష్మి, డాక్టర్ యనమండ్ర మాధవి, డాక్టర్ సాయినాథ్‌లాంటి వారి కచ్చేరీలతో పాటు ప్రతి రోజు ఉదయం మధ్యాహ్నం పలువురి హరికథలు వినిపించారు. 49 సంవత్సరాలుగా జరుగుతున్న ఈ ఉత్సవాలు 2015మార్చి నెలలో ఘనంగా 50సంవత్సరాల పండుగను జరుపుకోనున్నాయి.

## పలువురి విరాళం...



విరాళాన్నందజేస్తున్న జె.బాలార్క, శిష్యబృందం

దాదాపు 5దశాబ్దాలుగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయంటే ఎంతో మంది వదాన్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అందిస్తున్న సహాయసహకారాలే కారణం. ఇప్పటికీ పలువురు తమ విరాళాలను బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసి తద్వారా వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం పాలపర్తి సాయిప్రసాద్, సీతాలక్ష్మి దంపతులు 50వేలు, శ్రీమతి జె.బాలార్క మరియు శిష్యబృందం కలిసి 20వేలు విరాళంగా అందజేసారు.

# సంస్కృతి, సంప్రదాయాల నిధి ఉగాది



పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో ఆంగ్ల సంవత్సరాదిని అత్యంత హుషారుగా కుర్రకారు హాట్‌హాట్‌గా జరుపుకొంటున్నప్పటికీ మన సంస్కృతీ సంప్రదాయాల విలువను గమనంలో వుంచుకున్న ప్రతి ఒక్కరు తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పర్వదిన సంబరాలను సంతోషంగా నెల్లూరులోని వాడవాడలా సమున్నతరీతిలో నిర్వహిస్తున్నారు.

ఆదిత్యనగర్‌లోని ఆదిత్య కళాశాల సమావేశ మందిరంలో జరిగిన ఉగాది వేడుకలో పాల్గొన్న ఆకాశవాణి ప్రతినిధి ఆనందరావు మాట్లాడుతూ ఉగాది రోజు నుంచే తెలుగు ప్రజలకు కాలమానం ప్రారంభమని తెలుపుతూ తెలుగుభాష గొప్పదనాన్ని వివరించారు. ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ సౌరమానం, చాంద్రమానాలను గురించి తెలిపి తిథి, వార, నక్షత్రాల కలయిక, పంచాంగ విశిష్టతలను తెలిపారు. తదుపరి జరిగిన కవిసమ్మేళనంలో కవులు చాణంపూరి కృష్ణయ్య, బొగ్గరపు రాధాకృష్ణ, శ్రీనివాసులునాయుడు, మహబూబ్‌బాషా, ఆనందరావు, మధు, ఇందిరా కృష్ణ, లలితలు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. పంచాంగ పఠనం, గణపతి పూజ, మహాశివునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో తెదేపా నేతలు ఉచ్చి భునేశ్వరిప్రసాద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధార్మిక సంస్థ అధ్యక్షులు జంగా శివకుమార్, మాచవోలు మురళీ, లోక్‌సాయి, సాయిహర్ష, నిరంజన్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు. సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో వివిధ రకాల ఫలపుష్పాలతో ఆలయాన్ని అలంకరించి శోభను చేకూర్చారు. అమ్మవారు తొలుత చందనాలంకారంలో దర్శనమిచ్చి తదుపరి శాకాంబరిగా కొలువు దీరారు. భక్తులు అంబలిపోసి మొక్కులు తీర్చుకున్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో వేదపండితులు నేలనూతల శ్రీనివాసమూర్తి పంచాంగ శ్రవణం చేయగా, రాజరాజేశ్వరి, గాయత్రి మాతాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి హోమాలు జరిపారు. మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ భువనేశ్వరిదేవిని ఫలపుష్పాలతో అలంకరించగా పరమేశ్వరునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం శోభాయమానంగా జరుగగా తదుపరి వాద్యగోష్టి, తెలుగు పంచాంగ ఆవిష్కరణ కవి సమ్మేళనం భక్తులను ఆనందపరిచాయి.

# ఫైనల్ ఆట!

(మొదటిపేజీ తరువాయి)

నెలలో ఎన్నికలున్నాయి. 25లోక్‌సభ, 175అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఇరుపార్టీలున్నాయి. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం చూస్తుంటే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈమధ్య కొన్ని సర్వేలు కూడా వైకాపాకే మొగ్గుందని తేల్చాయి. తెలుగుదేశం నాయకులు దీనిని ఒప్పుకోవడం లేదు. ఆ సర్వేలు బూటకమంటున్నారు. ఏకంగా ఓ న్యూస్‌ఛానెల్ వారి మీదయితే నిప్పులు కక్కుతున్నారు. ఇంకో సర్వేవాళ్లు సీమాంధ్రలో టీడీపీది పైచేయి అంటే తెలుగుదేశం అనుకూల పత్రికలు మాత్రం దానిని పతాక శీర్షికలకెక్కించాయి. మీడియా కూడా వైకాపా, తెదేపా గ్రూపులుగా విడిపోయి యుద్ధం చేసుకుంటున్నాయి.

రాజన్న రాజ్యం తెస్తానంటూ వై.యస్. జగన్మోహన్‌రెడ్డి, సీమాంధ్రను స్వర్ణాంధ్రను చేస్తానంటూ చంద్రబాబునాయుడు ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈ పోరులో ఎవరు పరాజితులైనా రాజకీయంగా పూర్తిగా తెరమరుగయ్యే అవకాశముంది.

# ఇక్కడ వెలవెల

(మొదటిపేజీ తరువాయి)

ఉండేది. కాని మూర్ఖంగానో, ఏకపక్షంగానో తెలంగాణను విభజించడం వల్ల కాంగ్రెస్ అక్కడ ప్రాణాలతో వుంది. టీఆర్‌ఎస్ కంటే ఓ మెట్టుపైనే వుంది. విభజన జరక్క పోయివుంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్లు అడిగే వాళ్లుండరు. కాని విభజన తర్వాత తెలంగాణలో ఆ పార్టీ స్టేటస్ ఒక్కసారిగా మారిపోయింది. తెలంగాణలో కాంగ్రెస్ టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఒక్కో సీటుకు పదిమంది నాయకులు దాక పోటీ పడే పరిస్థితి వచ్చింది.

అదే సమయంలో సీమాంధ్రలో పరిస్థితి చూస్తే... కాంగ్రెస్‌పార్టీ ఆఫీసు ముందు 'ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు కావలెను' అనే బోర్డును పెట్టాల్సిన పరిస్థితి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే చాలామంది తెదేపా, వైకాపాలలోకి చెక్కేసారు. కాంగ్రెస్‌లో మిగిలిన నాయకులు కూడా సొంతంగా ఖర్చుపెట్టుకుని ఎవరూ పోటీ చేయాలనుకోవడం లేదు. పార్టీయే ఖర్చులకు డబ్బిలిస్తే మాత్రం పోటీ చేసేందుకు ద్వితీయ శ్రేణి నాయకులు సిద్ధంగా వున్నారు.

మొత్తానికి తెలంగాణలో కాంగ్రెస్ ఊహించని విధంగా పెరిగింది. సీమాంధ్రలో మాత్రం దాని పరిస్థితి చచ్చిన శవమే అయ్యింది.

# నెగ్గేదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

ఏంటంటే 90శాతం మంది ముస్లింలు వైకాపా వైపే ఉండడం. వైకాపా మైనార్టీ ఓటు బ్యాంకును నమ్ముకుంటే తెలుగుదేశం పార్టీ మాత్రం మధ్యతరగతి, మేధావులు, బీసీలు, యువత, ఉన్నతవర్గాల ఓట్లపై ఆశలు నిలుపుకుంది. ఈ వర్గాలలో అధికశాతం మంది తమ పార్టీకే మద్దతుగా నిలిచారనేది ఆ పార్టీ నాయకుల అభిప్రాయం. కాబట్టి మెజార్టీ డివిజన్‌లు తమకే వస్తాయని వారి ధీమా!

అయితే ఇక్కడ మేయర్ పీఠంపై ఎవరికి ఎంత అవకాశం ఉందనేది చూడాలి. గెలిచిన 54మంది కార్పొరేటర్లతో పాటూ నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, వాకాటి నారాయణరెడ్డిలు కార్పొరేషన్‌లో కో-ఆప్షన్‌సభ్యులవుతారు. అంటే వీరిని కలుపుకుంటే మొత్తం 59 ఓట్లు. 30సీట్లు ఎవరికి వస్తాయో వారిదే మేయర్ సీటు. వైకాపా, టీడీపీలలో ఏ పార్టీకైనా 30డివిజన్‌లు వచ్చేస్తే మేయర్ కుర్చీకి చేరువైనట్లే. అయితే ఎన్నికలు జరిగిన తీరును బట్టి చూస్తే ఏ పార్టీకి 30సీట్లు రాకపోవచ్చునని అంచనా! ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాకుంటే కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ఇండిపెండెంట్లు, కో-ఆప్షన్‌సభ్యులు కీలకమవుతారు. ఇండిపెండెంట్లు ఎవరికి మద్దతిస్తారనేది చెప్పలేము. కాంగ్రెస్ సభ్యులు మాత్రం తెలుగుదేశంకే మద్దతిచ్చే అవకాశాలున్నాయి. ఇక బీజేపీ కూడా తెలుగుదేశం వైపే వుంటుంది. వైసిపితో పొత్తు లేకుంటే సీపీఎం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పార్టీ నిర్ణయం మేరకే నడుచుకోవచ్చు. ఇక కో-ఆప్షన్‌లలో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఎలాగూ టీడీపీనే. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేకా, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిలు తెలుగుదేశంకే అనుకూలంగా ఉండే అవకాశముంది. అయితే ఇదంతా కూడా ఏ పార్టీకి 30సీట్లు రాకుంటేనే! ఏ పార్టీకి 30సీట్లు రాకుంటే మిగతా పార్టీలు, కో-ఆప్షన్‌లు, ఇండిపెండెంట్లు కింగ్‌లవుతారు.

# కమలంకు ఆత్మకూరే!

(2వపేజీ తరువాయి)

ఆయన పోటీ చేయవచ్చు. అయితే ఈ నియోజకవర్గంలో బీజేపీకి కేడర్ లేదు. సర్వేపల్లి కన్నా కూడా ఆత్మకూరులో బీజేపీకి పట్టుంది. 1985, 1989, 2004 ఈ మూడు ఎన్నికలలోనూ ఇక్కడ బీజేపీ అభ్యర్థులు విజయం అంచుల దాకా వచ్చి ఓడిపోయారు. 1985లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెంకయ్యనాయుడు కేవలం 800ఓట్లు తేడాతో ఓడిపోయారు. 1989లో బీజేపీ అభ్యర్థి కర్నాటి ఆంజనేయరెడ్డి గెలిచినంత పని చేసి కేవలం 250ఓట్ల తేడాతో ఓడిపోయాడు. 2004లో ఇదే బీజేపీ నుండి దిగిన బొల్లినేని కృష్ణయ్య కూడా కేవలం వెయ్యిఓట్ల తేడాతోనే ఓడిపోవడం జరిగింది.

ఈ నియోజకవర్గంలో కేడర్ వుంది కాబట్టి బీజేపీ రాష్ట్ర నాయకత్వం కూడా ఆత్మకూరు వైపే మొగ్గుచూపే అవకాశముంది. ఆత్మకూరు సీటును కేటాయిస్తే ఎవరు పోటీచేస్తారనేది కూడా ప్రశ్నే! చెరుకూరు రమణప్పనాయుడు ఉన్నప్పటికి మేకపాటి వాళ్ల ముందు చాలకపోవచ్చు. ఇక బొల్లినేని అన్నదమ్ములు కూడా ఎవరూ దిగకపోవచ్చు. ఈ నేపథ్యంలో ఆత్మకూరుతో మంచి సంబంధాలున్న కర్నాటి ఆంజనేయరెడ్డినే అభ్యర్థిగా బరిలోకి దించే అవకాశాలున్నాయి.

# దిగజారిన పొత్తులు

(మొదటిపేజీ తరువాయి)

వైకాపా గ్రాఫ్ ఎక్కువుగా వుంది. బీజేపీతో పొత్తు కుదిరితే తన గ్రాఫ్‌ను పెంచుకోవచ్చని చంద్రబాబు ఆలోచన.

మరోపక్క టీడీపీ, బీజేపీ జతకడితే రాజకీయంగా వారికి లాభమని, తమకు కొంత నష్టమని వైకాపా వారికీ తెలుసు. అందుకే టీడీపీతో పొత్తు పెట్టుకోకుంటే ఎన్నికల తర్వాత కేంద్రంలో మా మద్దతు మీకేననే సంకేతాలను బీజేపీ అధిష్టానానికి పంపారు. ఈ పక్క జగన్ భరోసా ఉంది కాబట్టే బీజేపీ వాళ్లు ఓ పట్టున చంద్రబాబుతో పొత్తుకు ఒప్పుకోలేదు.

తెలంగాణలో ఇదే పరిస్థితి. కాంగ్రెస్‌లో విలీనం కావడం మాట అటుంచి పొత్తును కూడా నిరాకరించిన టీఆర్ఎస్ పరిస్థితి కూడా ఏమంత బాగాలేదు. తెలంగాణలో టీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్సే ఓ అడుగు ముందుందని సర్వేలు ఘోషించేసరికి కేసీఆర్ ఘొల్లుమన్నాడు. వెంటనే బీజేపీతో పొత్తుకు పరుగులు తీసాడు. ఓపక్క బీజేపీ, టీడీపీ పొత్తు చర్చలు జరుగుతుంటే, మరోపక్క బీజేపీతో బంధం కోసం టీఆర్ఎస్ తాపత్రయపడుతోంది. మొత్తానికి రెండు రాష్ట్రాలలోనూ పొత్తుల రాజకీయం జోరుగా సాగింది. ఈ పొత్తుల ఆటలో బీజేపీ కేంద్రబిందువు కావడం విశేషం.



# గూడూరు డివిజన్ వార్తలు

### శ్రీ రామరక్షా సేవాసంఘం ఆధ్వర్యంలో
## ఘనంగా ఉగాది వేడుకలు



స్వయంపాకుల శ్రీనివాసులును సన్మానిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం

గూడూరు రెండో పట్టణంలోని మాళవ్యానగర్ ప్రాంతంలో శ్రీ రామరక్షా సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా నెల్లూరు వి.ఆర్.ఉన్నత పాటశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు స్వయంపాకుల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాశిఫలాలు, పంచాంగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు, శ్రీ కంఠం నాగరాజారావు, శ్రీకంఠం రామ్మోహన్‌రావు, బాలసుబ్రహ్మణ్యం, సుబ్బారావు, సునీల్, గురుగుహ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా విజయంపై ధీమా
### ఎల్లసిరి గోపాల్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

గూడూరు పురపాలక సంఘ ఎన్నికల్లో వైకాపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్ ధీమా వ్యక్తం చేసారు. గూడూరు రెండోవ పట్టణంలో నరసింహారావుపేటలో వున్న ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సోమవారంనాడు వైకాపా తరపున కౌన్సిలర్లుగా పోటీచేసిన అబ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ నాసిన నాగులు, వైకాపా తరపున కౌన్సిలర్లుగా పోటీచేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

### గూడూరు పురపాలకసంఘం ఎన్నికల్లో...
## తెలుగుదేశం విజయం సాధిస్తుంది



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు

గూడూరు పురపాలక సంఘ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావు అన్నారు. గూడూరులోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఛైర్మెన్ పీఠాన్ని తమ పార్టీకే దక్కించుకుంటామన్నారు. అంతకుముందు ఆయన పట్టణంలో వార్డుల వారీగా బరిలో వున్న అభ్యర్థులతో మాట్లాడుతూ ఓటింగ్ సరళిపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిని పొనకా దేవసేన, పార్టీ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, శీలం కిరణ్‌కుమార్, పొనకా శివకుమార్‌రెడ్డి, నరసింహులు నాయుడు, బల్లి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ప్రచారాలు



నెల్లటూరులో ప్రచారం చేస్తున్న వైకాపా ఎంపిటీసీ అభ్యర్థి

గూడూరు మండలంలోని పలుపార్టీల నాయకులు ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు సోమవారం గ్రామాల్లో ప్రచార పర్వంను కొనసాగించారు. నెల్లటూరు ఎంపీటీసీ స్థానం నుంచి పోటీలో ఉన్న అబ్యర్థి సుబ్బయ్య, స్థానిక సర్పంచి బుజ్జమ్మ, వైకాపా నాయకుడు నెలబల్లి భాస్కరరెడ్డితో కలిసి గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మేజర్ పంచాయతీ చెన్నూరులోని మూడు ఎంపీటీసీ స్థానాల నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు తెలుగుదేశంపార్టీ నాయకుడు చేవూరు విజయమోహన్‌రెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని హైమావతి దీవిపాళెం పంచాయతీలో సోమవారం ఆ పార్టీ నాయకుడు కోదూరు శ్రీనివాసులు రెడ్డి, చేవూరు విజయమోహనరెడ్డి, బొల్లినేని కోటేశ్వరరావు, కోటంరెడ్డి రాధారెడ్డి తదితరులు ఇంటింటా ప్రచారం చేశారు. వైకాపా జడ్పీటీసీ అభ్యర్థిని పద్మ, విందురూ, రామలింగాపురాల్లో పర్యటించారు.

## ముత్యాలమ్మ జాతర విజయవంతం

అధికారులు భక్తుల సహకారంతోనే తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించగలిగామని ముత్యాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి, ఈవో తాతా శ్రీనివాసరావులు తెలిపారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సభ్యులు నారాయణ, శివకుమార్, జనార్థన్, సింహాద్రి, మదన్ మోహన్, మదన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న...
## సాంస్కృతిక కార్యక్రమాలు



భరతనాట్యం వేస్తున్న విద్యార్థినులు

గూడూరులో జయనామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని సంస్కృతిక సమ్మేళనం సహకారంతో శ్రీ మురళీ కృష్ణ యోగా ఆధ్యాత్మిక డాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణంలో విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. అంతకు ముందు యోగా వ్యాయామ విన్యాసాలు ప్రదర్శించారు. సంస్కృతిక సమ్మేళనం అధ్యక్షులు జనార్థన్‌రెడ్డి, కార్యదర్శి కె.మునిగిరీష్, శివయ్య, శివసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

## చందనాలంకారంలో చెంగాళమ్మతల్లి



శ్రీ జయనామసంవత్సరం తొలిదినమైన మార్చి 31న సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ తల్లికి లక్ష కుంకుమార్చన శోభాయమానంగా జరిగింది. ఆలయం వద్ద చెంగాళమ్మ తల్లికి అంబళ్ళు పోసి ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేసారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తి అమ్మవారికి ఆలయ పాలకమండలి ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, ఈఓ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పాలకమండలి సభ్యులు లక్ష కుంకుమార్చనను ప్రారంభించారు. పంచాంగ పఠనాన్ని మూర్తి రాంబాబు శర్మ శ్రవణపేయంగా చేసారు. తదుపరి అమ్మవారు చందనాలంకారంలో దర్శన మిచ్చారు. చందనాలంకార దివ్యస్వరూప దర్శన కార్యక్రమానికి మాగుంట పార్వతమ్మ, మాగుంట సుధాకర్‌రెడ్డి, స్నేహలత, మాగుంట శ్రీనివాసులురెడ్డి, గీతా లతలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసంతర్పణలో దాదాపు 1000మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

## మానవతా విలువలుగల సాహితీవేత్త మహేశ్వర్



శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం షార్‌లోని స్లాబ్ విభాగంలో సీజీఎంగా పనిచేస్తూ ఇటీవల మరణించిన శాస్త్రవేత్త నెల్లూరీయులు సీవీఎస్ మహేశ్వర్ సంతాపసభ మార్చి 29వతేది రాత్రి సూళ్ళూరుపేటలోని పులికాట్ నగర్‌లోగల అంతరిక్ష కళాక్షేత్రంలో జరిగింది. సభలో పాల్గొన్న షార్ డైరెక్టర్ ఎమ్‌వైఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మహేశ్వర్ అంకిత భావంతో విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. షార్ అసిస్టెంట్ డైరెక్టర్ శేషగిరిరావు మహేశ్వర్‌ను మంచి సాహితీవేత్తగా అభివర్ణిస్తూ ఆయన లేని లోటు సాహితీరంగానికి తీర్చలేనిదన్నారు. నెల్లూరులోని విఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహేశ్వర్ విద్యార్థులను ఎంతో ప్రోత్సహించేవారని ఆయన కళాశాలలో చేసిన ప్రసంగం స్ఫూర్తితో విద్యార్థులు షార్ కేంద్రాన్ని సందర్శించి ఎంతో సమాచారాన్ని తెలుసుకున్నారని తెలిపారు. షార్ కేంద్రం విశ్రాంత గ్రూప్ డైరెక్టర్ సి.రవీంద్రనాథ్ మహేశ్వర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సూళ్ళూరుపేట చెంగాళమ్మ ఆలయట్రస్టుబోర్డు ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, పారిశ్రామికవేత్త కాళంగి ప్రభాకర్, షార్ ఉద్యోగులు, షార్‌వాణి, జనవిజ్ఞాన వేదిక, యూపీఎఫ్, పునర్వసు తదితర సంస్థల ప్రతినిధులు, మహేశ్వర్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు. స్నేహశీలి, మానవతావిలువలుగల సాహితీవేత్త మహేశ్వర్ మన మధ్య లేకపోవడం విచారకరమని ఈ సంతాపసభను నిర్వహించిన ఎ.రామ లింగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించి మహేశ్వర్ ఆత్మకు నివాళులర్పించారు.

## ఏసి స్టేడియం వాకర్స్‌కు ఉచిత వైద్యపరీక్షలు



నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఈ నెల 1న ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్‌సీడీ నోడల్ అధికారి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 8జిల్లాలను అసంక్రమణవ్యాధుల నిర్ధారణ కోసం ప్రభుత్వం ఎంపిక చేసిందని, వాటిలో నెల్లూరు కూడా వుందని తెలిపారు. మధుమేహం, బీపీ, క్యాన్సర్, గుండె, మెదడు సంబంధిత వ్యాధులను స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా గుర్తించడం జరుగుతుందని, తద్వారా తగిన చికిత్స చేయించుకుని ఈ వ్యాధులవల్ల ఏర్పడే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 5లక్షల మంది పైగా స్క్రీనింగ్ చేసి 8 నుండి 9శాతం వరకు బిపి, మధుమేహవ్యాధిగ్రస్థులున్నట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పి.దయాకర్‌రెడ్డి, కార్యదర్శి బి.శేషగిరిరావు, కోశాధికారి నారాయణరావు, సభ్యులు దద్దోలు రమణయ్య, రాఘవేంద్ర శెట్టి, బలరామయ్యనాయుడు, సుందరరామిరెడ్డి, కృష్ణయ్య, హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్లు సత్యనాథ్, యం.యస్.రెడ్డి, శ్రీనివాసకుమార్, నాగేశ్వరరావు, దొరస్వామినాయుడులు వైద్యపరీక్షలు నిర్వహించారు.

### మున్సిపల్ అభ్యర్థుల్లో
## ఉత్కంఠ నిలిపిన హైకోర్టు

గూడూరు పురపాలక సంఘంలో ఆదివారం 32వార్డులకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఇక ఓట్ల లెక్కింపు మాత్రమే మిగిలింది. రాష్ట్ర ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 2వతేదీ ఓట్లు లెక్కింపు జరగాల్సి ఉండగా హైకోర్టు ఈనెల 9వతేదీకి ఓట్ల లెక్కింపు జరుపుటకు నిర్ణయించింది. గెలుస్తామని నమ్మకం ఉన్నా తీర్పు ఆలస్యం కావడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. కొంతమంది తమ సన్నిహితులతో ఓటింగ్ సరళిపై చర్చించుకోవడం కనిపించింది. వార్డుల్లో పోటీచేసిన అభ్యర్థులు స్థానికంగా జరిగిన ఓటింగ్ సరళిని బట్టి తాము గెలుస్తామా? లేదా? అని ఓ అంచనాకొచ్చారు. గట్టిపోటీ ఉన్నచోట కొద్ది ఓట్ల తేడాతోనైనా బయటపడకపోతామా? అని ఆశతో వున్నారు.

# 'లెజెండ్'కు సింహపురి నీరాజనం



'లెజెండ్' బాలకృష్ణకు బుధవారం రాత్రి సింహపురి అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన "లెజెండ్" సినిమా యూనిట్ నెల్లూరు విచ్చేసిన సందర్భంగా నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు వద్ద నందమూరి బాలకృష్ణ సేవాసమితి జిల్లా కన్వీనర్, నెల్లూరు నగర తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నాయకత్వంలో స్వాగతం పలికారు. సినిమా యూనిట్ నగర పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తూ నర్తకి సినిమాహాల్‌కు చేరుకొన్న అనంతరం అక్కడ అభిమానులనుద్దేశించి హీరో బాలకృష్ణ మాట్లాడుతూ ప్రేక్షకులే మాకు దేవుళ్లు, నందమూరి వంశాన్ని వారు ఆదరిస్తూనే ఉన్నారు. నాటి ముద్దుల మామయ్య విజయోత్సవానికి ఎలా ఆదరించారో నేటికీ అంతకు రెట్టింపుగా ఆదరిస్తున్నారన్నారు. అలాంటి అభిమానులను ఎప్పటికీ మరువనని, ప్రేక్షకులు మంచిసినిమాలను ఆదరిస్తారనేందుకు 'లెజెండ్' ఒక నిదర్శనమన్నారు. ఇంకా చిత్ర నిర్మాత, పలువురు కళాకారులు సభలో పాల్గొన్నారు.

## అభిమానుల నిరాశ...

జిల్లా పర్యటనకు బాలయ్య వస్తున్నాడని తెలిసి జిల్లాలోని మారుమూల గ్రామాల నుండి వందలాది మంది అభిమానులు బుధవారం సాయంత్రం 4గంటలకు నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు వద్దకు చేరుకున్నారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. 4గంటలకు రావలసిన బాలయ్య 8గంటలకు వచ్చాడు. కనీసం బస్సు నుండి బయటకు రాకపోగ బస్సు అద్దాలు కూడ తెరవలేదు. రాజకీయంగా తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రముఖులు ఈ ర్యాలీలో హాజరుకాలేదు. కేవలం కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హవా తప్ప మరేమీ కనిపించలేదు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర సరిహద్దులలో స్వాగతం పలికి వెళ్ళిపోయారు. సోమిరెడ్డి, శ్రీధరకృష్ణారెడ్డి, ఇతర నాయకులు అక్కడకు రాకపోవడం అభిమానులలో ఒక చర్చగా మారింది.

# మైనార్టీల అభ్యున్నతికి పాటుపడింది వైఎస్సారే

**- కాకాణి**

నెల్లూరులో వైఎస్సార్సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో ఈనెల 1న వెంకటాచలం మండలం కసుమూరు గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు జమీర్, మహ్మద్, లియాకత్, దస్తగిరి, సుభాన్, ఖాదర్‌బాష తదితర నాయకులు, 200మంది కార్యకర్తలు, ముజావర్లు వైఎస్సార్సీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీల అభ్యున్నతికి పాటుపడ్డారని, ముస్లింలకు 5శాతం రిజర్వేషన్‌ను ప్రకటించినప్పుడు కొందరు అడ్డుపడినా 4శాతం రిజర్వేషన్ సాధించి దేశంలోనే సంచలనం కలిగించారన్నారు. కాంగ్రెస్, టీడీపీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని, రాష్ట్రాన్ని ముక్కలు చేసి సీమాంధ్రకు అన్యాయం చేసాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్ ఆరోజు ప్రవేశపెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్‌తోనే ఎంతో మంది మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగాలు పొందారని, జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన అమ్మ ఒడి పథకంతో ఎందరో విద్యావంతులయ్యే అవకాశం వుందని పేర్కొన్నారు. మాట మీద నిలబడని వ్యక్తిగా పేరున్న చంద్రబాబు ఎన్నో ప్రకటనలిస్తూ ప్రజలను ప్రలోభపెట్టి అధికారం పొందాలని చూస్తున్నారని కాని సామాన్య ప్రజల దగ్గర ఆయన నక్కజిత్తులు ఇప్పుడు చెల్లుబాటుకావని అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వ్యక్తిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన తుది శ్వాస వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## విభజనపార్టీలకు గుణపాఠం చెప్పాలి

నెల్లూరు ఆత్మకూరు బస్టాండు దగ్గరగల పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఈనెల 1న జై సమైక్యాంధ్ర పార్టీ నగర కన్వీనర్ ఆనం జయకుమార్‌రెడ్డి పూలమాల అలంకరించి పార్టీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు పాల్పడ్డ పార్టీలన్నింటికీ గుణపాఠం చెప్పాలన్నారు. చంద్రబాబునాయుడు రెండు కళ్ళ సిద్ధాంతంతో తెలుగు ప్రజలకు తీరని అన్యాయం చేసారని, రాష్ట్ర విభజనలో కాంగ్రెస్‌కు బీజేపీ కూడా సహకరించిందని, ఆ పార్టీలను కూడా బహిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు ఆధ్వర్యంలో వందమంది కార్యకర్తలు ఆనం జయకుమార్‌రెడ్డి సమక్షంలో జై సమైక్యాంధ్ర పార్టీలో చేరారు. కార్యక్రమంలో యేసునాయుడు, బాబునాయుడు, వెంకటేశ్వర్లు, మునెమ్మ, రాజేశ్వరి, రవీంద్ర, కేశవులు, రబ్బానీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకయ్యకు తప్పిన ప్రమాదం



"నమో" నామస్మరణతో దేశం నలు మూలలా పర్యటిస్తున్న బీజేపీ జాతీయ నాయకుడు, నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడికి మరోసారి విమాన ప్రమాదం తప్పింది. ఆయన గతంలో పలుసార్లు వివిధ వాయు వాహన ప్రమాదాల నుండి తృటిలో తప్పించుకున్నాడు. ఈసారి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ప్రచారం ముగించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కొరకు విమానం ఎక్కాడు. అయితే ఆ విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే ఇంజన్‌లో సాంకేతిక లోపంతో మళ్ళీ ల్యాండైపోయింది. పైలెట్ చాకచక్యంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వెంకయ్య భారతీయ జనతాపార్టీకి ఓ వరం. ఆయన స్వరమే ఆ పార్టీకి ఆధారం. ఆయన పదికాలాల పాటు చల్లగా వుండాలని ఆశిద్దాం!


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# 27న మోడల్ ఎంసెట్



నెల్లూరుజిల్లాలో ఎంసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ మోడల్ ఎంసెట్ నిర్వహించడం హర్షనీయమని నెల్లూరు నగర కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి డాక్టర్ జెడ్.శివప్రసాద్ అన్నారు. గురువారం నెల్లూరు ఎన్‌టిఆర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంసెట్‌కు ముందుగానే వారి యొక్క మేధస్సును పరీక్షించుకొనేందుకు ఈ మోడల్ ఎంసెట్ ఎంతో ఉపయోగపడుతుంది, కావున జిల్లాలో ఎంసెట్ రాసే ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జెడ్.శివప్రసాద్ పిలుపునిచ్చారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమల నాయుడు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన లెక్చరర్స్‌చే మోడల్ పేపరు తయారు చేయించడం జరుగుతుందని, విద్యార్థులు వారు చదివే కాలేజీ ఆఫీసులోనే హాల్‌టికెట్స్ పొందవచ్చని, ఈ నెల27వతేది మధ్యాహ్నం 2 గంటల నుండి 5గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, అదేవిధంగా పరీక్షలలో జిల్లావ్యాప్తంగా ర్యాంకు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.


44th ANNIVERSARY
వార్షికోత్సవ ఓం కృతజ్ఞతాభివందనములు
"మురళీకృష్ణ గ్రూప్" ని 44 సంవత్సరాలుగా ఆదరిస్తున్న
మా కస్టమర్ దేవుళ్ళ
అభిమానమే అండగా ...
మీ ఆదరాభిమానాలు పొందుతున్న మా గ్రూప్స్
★ మురళీకృష్ణ 70
Multicuisine A.C. Restaurant
★ మురళీకృష్ణ శాఖాహార భోజనం
కాఫీ, టిఫిన్ & ఐస్‌క్రీమ్స్
★ మురళీకృష్ణ నేతిమిఠాయిలు
★ మురళీకృష్ణ పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు
నిర్వాణ Multicuisine A.C.Restaurant,
మాగుంట లేఅవుట్,
సరికొత్త రుచులతో
నూతన ఒరవడికి
శ్రీకారం... నిత్య నూతనం
మా మీ " మురళీకృష్ణ "
సకుటుంబ సమేతంగా విచ్చేసి మా ఐటమ్స్‌ని ఆస్వాదించండి...
ఆరగించండి... ఆనందించండి... మమ్ము ఆశీర్వదించండి!
మీ... గ్రోసు గోపాలయ్య

మురళీకృష్ణ 70 గ్రూప్ నెల్లూరు ఫోన్ : 2327522


Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.